


ఆంధ్రజ్యోతి



అమరావతికి ఆర్థిక పునరుజ్జీవం

అవిరైన ఆశలకు ఊపిరిపోశారు. అమరావతి అభివృద్ధికి మళ్లీ బీజం వేశారు. ఐదేళ్ల తర్వాత కలలను సాకారం చేస్తూ సోమవారం అసెంబ్లీలో రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్‌పై ఉమ్మడి కృష్ణాజిల్లావాసుల నుంచి హర్షాతిరేకాలు వ్యక్తమవుతున్నాయి. బందరు పోర్టు, గన్నవరం విమానాశ్రయం, అమరావతి మెట్రో.. వంటి కీలక ప్రాజెక్టులకు కేటాయింపులు శుభపరిణామాలుగా పేర్కొంటున్నారు. ఇక బడ్జెట్ ప్రసంగంలో ఆర్థిక మంత్రి పయ్యావుల కేశవ్ అమరావతి అవుటర్ రింగురోడ్డు అవసరాన్ని తెలియజేయడం మరో ముఖ్యమైన అంశంగా చెబుతున్నారు.

- (విజయవాడ-ఆంధ్రజ్యోతి)



రాజధానికి రెక్కలు

ఉమ్మడి కృష్ణాకు రాష్ట్ర బడ్జెట్‌లో కేటాయింపులు

అమరావతి అవుటర్‌పై ఆశలు

'గత ప్రభుత్వ హయాంలో అమరావతి అవుటర్ రింగురోడ్డు ప్రాజెక్టు నిలిచిపోయింది. 189 కిలోమీటర్ల పొడవైన ఈ రోడ్డు ఎక్స్‌ప్రెస్-వే పునరుద్ధరణకు కేంద్ర ప్రభుత్వం ఆమోదం తెలిపింది. ఈ ప్రాజెక్టు రాజధానిని.. రాష్ట్రంలోని ఇతర ప్రాంతాలతో అనుసంధానిస్తుంది. ఈ ప్రాజెక్టు మన రాష్ట్రంలో ప్రాంతీయ అనుసంధానతను, ఆర్థిక అభివృద్ధిని పెంచుతుంది.' అని ఆర్థిక మంత్రి పేర్కొన్నారు.

కృష్ణా వర్సిటీ, వీఎంసీకి ఊతం

మచిలీపట్నంలోని కృష్ణా యూనివర్సిటీకి రూ.9.67 కోట్లు కేటాయించారు. వైసీపీ ప్రభుత్వం అరకొర కేటాయింపులతో నెట్టుకురాగా, టీడీపీ ప్రభుత్వం వర్సిటీకి కేటాయింపులను గణనీయంగా పెంచింది. అలాగే, విజయవాడ నగరంలో మౌలిక వసతుల కల్పనకు వీఎంసీకి రూ.10 కోట్లు కేటాయించారు.

అమరావతికి ఊపిరినిస్తూ లైట్ మెట్రోలో కదలిక

- రూ. 50 కోట్లు కేటాయిస్తూ కీలక నిర్ణయం
- బందరు పోర్టుకు రూ. 150 కోట్లు
- కృష్ణా వర్సిటీ, వీఎంసీకి కూడా నిధులు
- కృష్ణాడెల్టాకు రూ. 377 కోట్ల కేటాయింపు

బందరు పోర్టుకు ముందడుగు

ఉమ్మడి కృష్ణా జిల్లావాసుల శతాబ్దాల కల మచిలీపట్నం పోర్టును గత వైసీపీ ప్రభుత్వం పూర్తిస్థాయిలో నిర్లక్ష్యం చేసింది. అధికారంలోకి వచ్చిన నాటి నుంచి పోర్టు నిర్మాణాన్ని ప్రశ్నార్థకంగా మార్చింది. నవయుగతో ఉన్న నిర్మాణ ఒప్పందాన్ని రద్దు చేసింది. ఆ తర్వాత డీపీఆర్ పేరుతో ఏడాది కాలక్షేపం చేశారు. 2020-21 బడ్జెట్‌లో కేవలం రూ.10 కోట్లు కేటాయించి చేతులు దులుపుకొన్నారు. 2021-22 బడ్జెట్‌లో రూ.150 కోట్లు కేటాయించినా పైసా ఖర్చు పెట్టలేదు. సుమారు రూ.12 వేల కోట్ల పైచిలుకు నిర్మాణ వ్యయమయ్యే పోర్టుకు ఈసారి బడ్జెట్‌లో రూ.150 కోట్లు కేటాయించారు.

కృష్ణాడెల్టాకు ఊపిరి

ఉమ్మడి కృష్ణాలో సుమారు 10 లక్షల ఎకరాల ఆయకట్టు ఉంది. కృష్ణాడెల్టా ఆధునికీకరణతో మొత్తం ఆయకట్టుకు నీరు అందే అవకాశం ఉంటుంది. దశాబ్దకాలంగా ఆధునికీకరణ పనులు సాగుతూనే ఉన్నాయి. రూ.3,900 కోట్లతో 2007లోనే కృష్ణాడెల్టా ఆధునికీకరణ పనులు చేపట్టారు. ఆ తర్వాత అంచనాలు రెట్టింపు య్యాయి. ఇప్పటి వరకు సుమారు రూ.2వేల కోట్లు ఖర్చు చేశారు. ఇంకా డెల్టా ఆధునికీకరణ పూర్తి కాలేదు. అంచనా వ్యయాలు పెరిగాయి. ప్రస్తుతం నిధుల కొరత కారణంగా పనులు జరగడం లేదు. డెల్టా ఆధునికీకరణ చేస్తే సాగునీరు వృథా కాకుండా ప్రతి నీటిబొట్టునూ సద్వినియోగం చేసుకునే అవకాశం ఉంటుంది. 2023లో వైసీపీ సర్కార్ రూ.279 కోట్లు కేటాయించగా, టీడీపీ సర్కార్ రూ.377 కోట్లు ఇచ్చింది.

- మరిన్ని కథనాలు 8లో

బడ్జెట్ భేష్ • ఎమ్మెల్యేల మనసులో మాట | **వామపక్షాల పెదవి విరుపులు**

8లో





విదేశీ.. విహంగామా

- కొల్లేరుకు భారీగా చేరిన విదేశీ పక్షులు
- రకరకాల పక్షులతో ఆటపాకలో సందడి
- పెరుగుతున్న పర్యాటకుల సంఖ్య

ఆనందం ఎగురుకుంటూ వచ్చింది. ఆహ్లాదం రెక్కలు విప్పుకొంటూ వాలింది. వినీలాకాశం నుంచి వచ్చిన విదేశీ అనుబంధాలు కొల్లేరుకు కొత్తకళను తెచ్చాయి. నీలాల నింగికీ, నీలరంగు నీటికీ వంతెన కడుతూ వచ్చిన ఈ విదేశీ పక్షులతో కైకలూరు నియోజకవర్గంలోని ఆటపాక పక్షుల కేంద్రం కిలకిలలాడుతోంది. కెనడా, సైబీరియా, ఆస్ట్రేలియా తీరప్రాంతాల నుంచి శీతాకాలపు అతిథులుగా వస్తున్న ఈ పక్షిరాజాలను చూసేందుకు పర్యాటకులు భారీగా తరలివస్తున్నారు. పెయింటెడ్ స్టాక్, పెలికాన్‌తో పాటు ఎర్రకాళ్ల ఉలసలు, తెల్ల, నల్ల కంకణాల పిట్టలు, జనకబాతులు, నీటికోళ్లు, ఊది చెంచుకోడి, పెద్ద ఉల్లంకి పక్షులు సంతానోత్పత్తి కోసం ఏటా శీతాకాలంలో ఇలా సందడి చేస్తుంటాయి. - కైకలూరు, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి)









మాలధారణం

శ్రీదుర్గామల్లేశ్వరస్వామి దేవస్థానం ఆధ్వర్యంలో భవానీ దీక్షల స్వీకరణ సోమవారం ప్రారంభమైంది. ఈ నెల 15 వరకు మండల దీక్షలు స్వీకరిస్తారు. ఆలయంలో దుర్గమ్మ అర్చనామూర్తిని పల్లకీలో ఊరేగింపుగా తీసుకొచ్చి, దీక్షల స్వీకరణ వేదిక వద్ద ఉంచారు. హారతులిచ్చిన అనంతరం గురుభవానీలు భక్తులకు దీక్షలు ఇచ్చారు.

6లో



కార్తీక పుణ్యస్నానం

కార్తీకమాసం రెండో సోమవారం శైవక్షేత్రాలు భక్తులతో కిటకిటలాడాయి. కృష్ణానదిలో పుణ్యస్నానాల అనంతరం దీపాలు వదిలి, సమీపంలోని శివాలయాల్లో స్వామిని దర్శించుకున్నారు. నాగాయలంకలోని శ్రీరామపాద క్షేత్రానికి భక్తులు భారీగా తరలివచ్చి, పుణ్యస్నానాల అనంతరం పరమేశ్వరుడికి అభిషేకాలు చేశారు.

తీరాన్ని తవ్వేస్తున్నారు..!

అవనిగడ్డలో బరితెగిస్తున్న ఇసుక మాఫియా



కొత్తపేట రేవు నుంచి ట్రాక్టర్లలో ఇసుక తరలింపు



నిమ్మగడ్డ రేవు నుంచి రాత్రిపూట ట్రాక్టర్లలో తరలిస్తున్న ఇసుక

- తీరాన్ని కొల్లగొడుతున్నా పట్టించుకోని అధికారులు
- పర్యావరణ చట్టాలకు తూట్లు పొడుస్తూ తవ్వకాలు
- దౌర్జన్యాలకు పాల్పడినా కేసులు నమోదు చేయరు
- ఇసుక తరలింపులో పంట పొలాలు నాశనం
- దారులకు గండ్లు కొడుతున్న రైతులు
- కొత్తదారులు వెతుక్కుంటున్న ఇసుకాసురులు

అవనిగడ్డ నియోజకవర్గంలో ఇసుక మాఫియా ఆగడాలకు అదుపు లేకుండాపోయింది. కోస్టల్ రెగ్యులేషన్ జోన్ (సీఆర్‌జెడ్) నిబంధనలు, పర్యావరణ చట్టాలను ఉల్లంఘిస్తూ ఇసుకాసురులు కృష్ణానది తీర గ్రామాల నుంచి పెద్ద ఎత్తున ఇసుకను అక్రమంగా తవ్వేస్తున్నారు. ఫలితంగా తీర గ్రామాలు ఉనికిని కోల్పోయే పరిస్థితులు ఏర్పడగా, అధికారులు మాత్రం చోద్యం చూస్తున్నారు.

అవనిగడ్డ, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి) : అవనిగడ్డ నియోజకవర్గ పరిధిలోని చల్లపల్లి, మోపిదేవి, అవనిగడ్డ మండలాల్లో రాత్రయితే ఇసుక మాఫియా చెలరేగిపోతోంది. చల్లపల్లి మండలం వెలివోలు, నిమ్మగడ్డ, ఆముదార్లంక రేవుల నుంచి నిత్యం వందలాది వాహనాల్లో ఇసుకను అక్రమంగా తరలిస్తున్నారు. ఇటీవల ఆముదార్లంక గ్రామంలో పెద్ద ఎత్తున ఇసుక తవ్వకాలు చేపట్టగా, అక్కడి ప్రజలు అడ్డుకుని ట్రాక్టర్లను రెవెన్యూ యంత్రాగానికి అప్పగించారు. కనీసం పట్టుకున్న ట్రాక్టర్లకు జరిమానాలు కూడా విధించని పరిస్థితిలో అధికారులున్నారు.

- నిమ్మగడ్డ వద్ద ఆ గ్రామానికి చెందిన ఓ ప్రజాప్రతినిధి కనుసన్నల్లో నిత్యం వందలాది బండ్లు, ట్రాక్టర్లతో ఇసుకను తరలిస్తున్నారు. దానిని అడ్డుకునేందుకు వెళ్లిన పోలీసులపై ఇసుక మాఫియా దాడికి తెగబడింది. ఈ దౌర్జన్యాలపై రెండు రోజుల కిందట రెవెన్యూ అధికారులే పోలీసులకు ఫిర్యాదు చేయగా, ఇంతవరకు కేసులు కూడా నమోదు చేయని పరిస్థితి ఏర్పడింది.
- మోపిదేవి మండలం మొత్తం సీఆర్‌జెడ్ పరిధిలో ఉందని, ఎవరు ఇసుక తవ్వినా చర్యలు

మిగతా 6లో..



పాండురంగడి బ్రహ్మోత్సవాలు ప్రారంభం

- చిలకలపూడి ఆలయంలో ఘనంగా గణపతి, విఠల్‌కోటి పూజలు
- వైభవంగా పల్లకీ ఉత్సవం
- నేడు కల్యాణోత్సవానికి ఏర్పాట్లు

6లో

ప్రజల సమస్యలకు సత్వర పరిష్కారం

ప్రజా సమస్యల పరిష్కార వేదికలో కలెక్టర్ బాలాజీ

భవానీ దీక్షల స్వీకరణ ప్రారంభం

- ఇంద్రకీలాద్రిపై మారుమోగిన జై దుర్గా జై జై దుర్గా నామస్మరణ
- చిరుమందహాసంతో కొలువుతీరిన కనకదుర్గమ్మ
- 15వ తేదీ వరకు మండల దీక్ష స్వీకరణ



కనకదుర్గమ్మ అర్చనా మూర్తికి హారతి ఇస్తున్న పీఠాధిపతి రాజాజీ గురుజీ. చిత్రంలో ఈవో రామారావు



మాలధారణకు వచ్చిన భవానీలు

విజయవాడ, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): ఇంద్రకీలాద్రిపై దుర్గామల్లేశ్వరస్వామి దేవస్థానంలో భవానీ దీక్షల స్వీకరణ కార్యక్రమం జై దుర్గా జై జై దుర్గా నామస్మరణ నడుమ సోమవారం ఘనంగా ప్రారంభమైంది. చిరుమందహాసంతో ఆసీనురాలయిన కనకదుర్గమ్మ అర్చనా మూర్తి కరుణా కటాక్షాలను కోరుతూ భక్తులు భవానీ దీక్షను స్వీకరించారు. ఈ నెల 15వ తేదీ వరకు మండల(41 రోజులు) దీక్షలు స్వీకరించనున్నారు. తొలుత ఆలయంలో దుర్గమ్మ అర్చనా మూర్తిని పల్లకిలో ఊరేగింపుగా దీక్షల స్వీకరణ వేదిక వద్దకు ఆలయ ఈవో రామారావు తదితరులు మేళతాళాలు, వేదమంత్రాలతో తీసుకువచ్చారు. వేదికపై అమ్మవారికి హారతి ఇచ్చారు, అనంతరం ఈవో రామారావు విఘ్నేశ్వర పూజ, అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించి దీక్షలకు శ్రీకారం చుట్టారు. దేవస్థానం తరఫున యద్దనపూడి నాగరాజుశాస్త్రి, యనమండ్ర ఉమాకాంత శర్మ ఆచార్య గురుభవానీలుగా భక్తులకు దీక్షలు ఇచ్చారు. మహిళలు, పురుషులు, బాలబాలికలు దీక్షలు స్వీకరించారు. దీక్షలు స్వీకరించినవారికి ఈవో రామారావు అమ్మవారి స్తోత్రాలు, నామాలు ఉన్న పుస్తకాలను పంపిణీ చేశారు. దీక్షలకు సంబంధించిన నియమ నిబంధనల కరపత్రాలను అందజేశారు. పురాణపండ శ్రీనివాస్ రాయగా, బొల్లినేని కృష్ణయ్య దంపతులు ప్రచురించి ఇచ్చిన శ్రీనిధి , లలితా సహస్రనామాల పుస్తకాలను పంచారు. ఈ సందర్భంగా ఈవో రామారావు మాట్లాడుతూ వార్షిక భవానీ మండల దీక్షల స్వీకరణ ప్రారంభమయిందన్నారు. డిసెంబరు 14వతేదీ సాయంత్రం శివరామకృష్ణ క్షేత్రం నుంచి కలశజ్యోతుల ఉత్సవం జరుగుతుందని తెలిపారు. అదే నెల 21 నుంచి 25 వతేదీ వరకు దీక్షల విరమణలు ఉంటాయన్నారు. డిసెంబరు 25 వ తేదీ ఉదయం 10 గంటలకు మహాపూర్ణాహుతి ఉంటుందని తెలిపారు. కలశజ్యోతులు, దీక్షల విరమణలకు సంబంధించి అన్ని ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. వైదిక కమిటీ సభ్యుడు, ముఖ్య అర్చకుడు ఆర్.శ్రీనివాసశాస్త్రి భవానీదీక్షల విశిష్టతను వివరించారు. వేద పండితుడు శ్యావాస మహర్షి, అర్చకుడు వి.రాజశేఖర్ తదితరులు పాల్గొన్నారు.



చిన్నారులకు మాలధారణ చేస్తున్న ఈవో రామారావు



మేళతాళాలతో అమ్మవారి ఊరేగింపు

అబుల్ కలాం ఆశయాలను సాధిద్దాం

ఆర్టీసీ చైర్మన్ కొనకళ్ల నారాయణరావు



సభలో మాట్లాడుతున్న ఆర్టీసీ చైర్మన్ నారాయణరావు. చిత్రంలో కలెక్టర్ బాలాజీ, ఎస్పీ గంగాధరరావు, డీఈవో రామారావు

మచిలీపట్నం టౌన్, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): దేశ మొదటి విద్యాశాఖ మంత్రి మౌలానా అబుల్ కలాం ఆజాద్ ఆశయాలను సాధిద్దామని ఆర్టీసీ చైర్మన్ కొనకళ్ల నారాయణరావు పిలుపునిచ్చారు. సోమవారం జెడ్పీ కాన్ఫరెన్సు హాలులో మౌలానా అబుల్ కలాం ఆజాద్ జయంతిని పురస్కరించుకుని జాతీయ విద్యాదినోత్సవం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా హాజరైన నారాయణరావు మాట్లాడుతూ ప్రజలందరూ విద్యావంతులవ్వాలని ఆకాంక్షించిన నేత మౌలానా అబుల్ కలాం ఆజాద్ అన్నారు. జిల్లా కలెక్టర్ డీకే బాలాజీ మాట్లాడుతూ కమ్యూనికేషన్ రంగం అభివృద్ధి కాని రోజుల్లోనే అబుల్ కలాం అరబ్బీ, పరిషియన్ భాషలు నేర్చుకోవడమే కాకుండా ఆ భాషల్లో కవితలు రాశారన్నారు. జిల్లా ఎస్పీ ఆర్.గంగాధరరావు మాట్లాడుతూ భారతీయుల మేధస్సు దేశ విదేశాల్లో విద్యారంగంలో రాణిస్తోందన్నారు. జెడ్పీ సీఈవో కన్నారావు, డీఈవో రామారావు ప్రసంగించారు. తొలుత మౌలానా అబుల్ కలాం ఆజాద్ చిత్రపటానికి పూలమాలలు వేసి శ్రద్ధాంజలి ఘటించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ ముస్లిం మైనారిటీ నాయకుడు అజీం, టీడీపీ నగర అధ్యక్షుడు ఎండీ ఇలియాస్ బాషా, జిల్లా సైన్స్ ఆఫీసర్ జాకీర్ అహమ్మద్ పాల్గొన్నారు.

అర్జీల సత్వర పరిష్కారానికి చర్యలు

జిల్లా ఇన్‌చార్జి కలెక్టర్ డాక్టర్ నిధి మీనా



ప్రజల సమస్యలు తెలుసుకుంటున్న జిల్లా ఇన్‌చార్జి కలెక్టర్ నిధి మీనా

కృష్ణలంక, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పీజీఆర్ఎస్) ద్వారా అందుతున్న ప్రతి అర్జీని క్షుణ్ణంగా పరిశీలించి సత్వర పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని జిల్లా ఇన్‌చార్జి కలెక్టర్ డాక్టర్ నిధి మీనా అధికారులకు సూచించారు. ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమంలో భాగంగా సోమవారం కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో డీఆర్వో ఎం.లక్ష్మీనరసింహతో కలిసి ఆమె అర్జీదారుల నుంచి వినతులు స్వీకరించారు. ఈ సందర్భంగా నిధి మీనా మాట్లాడుతూ అర్జీలపై అధికారులు ప్రత్యేక దృష్టి పెట్టాలని చెప్పారు. పీజీఆర్ఎస్ కార్యక్రమంలో మొత్తం 123 అర్జీలు వచ్చినట్లు వివరించారు.

ప్రతి ఇంటా వెలుగులు నింపాలి

హోంమంత్రి అనిత

ఎస్‌ఎల్‌వీలో ఘనంగా కార్తీక దీపోత్సవం



కార్తీక దీపాలు వెలిగిస్తున్న హోంమంత్రి అనిత

గుణదల, నవంబరు 11(ఆంధ్రజ్యోతి): కార్తీక మాసం ప్రతి ఇంటా చీకటిని పారద్రోలి వెలుగులు నింపాలని హోంమంత్రి అనిత ఆకాంక్షించారు. రామవరప్పాడు ఇన్నర్ రింగ్‌రోడ్డు సమీపంలోని ఎస్ఎల్‌వీ బిల్డర్స్ అండ్ డెవలపర్స్ విల్లాస్‌లో రత్నగణపతి ఆలయం వద్ద కార్తీక దీపోత్సవం సోమవారం ఘనంగా జరిగింది. ముఖ్యఅతిథిగా రాష్ట్ర హోంమంత్రి అనిత హాజరై మాట్లాడుతూ కార్తీక మాసంలో పెట్టే దీపం మన జీవితంలో పెనుమార్పులు తీసుకొస్తుందని చెప్పారు. పవిత్రమైన కార్తీకమాసంలో దీపోత్సవ కార్యక్రమాన్ని ఎస్ఎల్‌వీ బిల్డర్స్ అండ్ డెవలపర్స్ వారు నిర్వహించడం ఆనందదాయకమన్నారు. భక్తశ్రద్ధలతో విల్లాస్‌లో నివాసాలు ఉండేవారంతా దీపోత్సవంలో పాల్గొని పరమశివుడి ఆశీస్సులు పొందడం విశేషం అని విజయనగరం ఎమ్మెల్యే పూసపాటి అతిధిగజపతిరాజు అన్నారు. ఎస్ఎల్‌వీ గ్రీన్ విల్లాస్ ద్వితీయ వార్షికోత్సవాన్ని పురస్కరించుకుని కార్తీక దీపోత్సవం నిర్వహించడం జరిగిందని బిల్డర్స్ అండ్ డెవలపర్స్ చైర్మన్ పెనుమత్స శ్రీనివాస రాజు తెలిపారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నేత కొమ్మారెడ్డి పట్టాభి, ఎస్ఎల్‌వీ సీఈవో నాని, ఎస్ఎల్‌వీ డైరెక్టర్ చైతన్య తదితరులు పాల్గొన్నారు.

ప్రజల సమస్యలకు సత్వర పరిష్కారం

- ప్రజావేదిక కార్యక్రమానికి ఆలస్యంగా వస్తే సహించేదిలేదు
- ప్రతి సోమవారం చేనేత వస్త్రాలు ధరించి సమావేశానికి రండి
- జిల్లా అధికారులకు కలెక్టర్ ఆదేశం



అర్జీలు స్వీకరిస్తున్న కలెక్టర్ బాలాజీ

మచిలీపట్నం టౌన్ , నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): ప్రజాపరిష్కార వేదికలో వచ్చిన ప్రజా సమస్యలను సకాలంలో జిల్లా అధికారులు పరిష్కరించాలని కలెక్టర్ డీకే బాలాజీ సూచించారు. కలెక్టరేట్ సమావేశపు హాలులో సోమ వారం ప్రజా సమస్యల పరిష్కార వేదికలో ప్రజల నుంచి కలెక్టర్ అర్జీలు స్వీకరించారు. ఈ సందర్భంగా జరిగిన సమావేశంలో కలెక్టర్ మాట్లాడుతూ ప్రజలు ఎంతో ఆశతో తమ సమస్యలను పరిష్కరిస్తారని జిల్లా నలుమూలల నుంచి ఉదయాన్నే వస్తారని తెలిపారు. మీకోసం కార్యక్రమం ప్రారంభమయ్యే సమయానికి జిల్లా అధికారులు హాజరు కాకపోతే ఎలా అని కలెక్టర్ ప్రశ్నించారు. ఆలస్యంగా వచ్చే అధికారులు మీకోసం హాలులోకి రానవసరం లేదని గ్రూప్‌లో మెసేజ్ పెట్టానని, అది చూడలేదా అని ఆలస్యంగా వచ్చిన అధికారులను నిలదీశారు. చేనేత దుస్తులను ప్రతి సోమవారం ధరించి చేనేత కళాకారులను ప్రోత్సహించాలని కలెక్టర్ సూచించారు.

వినతులు ఇలా..

ఇళ్ల నిర్మాణాలకు చెల్లించవలసిన బిల్లు బకాయిలను చెల్లించాలని బాపులపాడు మండలం రంగన్నగూడెం లబ్ధిదారులు కలెక్టరుకు అర్జీ సమర్పించారు. తన కుమారుని పాఠశాలలోకి వెళ్లనీయకుండా నెల్లూరు రవీంద్ర భారతి పాఠశాల వారు బయట కూర్చోపెడుతున్నారని మలకాపట్నానికి చెందిన బుర్రా దుర్గానాగాంజనేయులు ఫిర్యాదు చేశారు. డ్రైవర్స్ కాలనీ స్థలాన్ని వ్యాపార సంస్థకు ఇచ్చారని, ఈ స్థలాన్ని సచివాలయానికి కేటాయించాలని టీడీపీ నాయకుడు పి.వి.ఫణికుమార్ అర్జీ సమర్పించారు. కృత్తివెన్ను మండలం కోమాళ్లపూడి పంచాయతీ శివారు గొల్లగూడెం గ్రామ నివాసి ఆముదాలపల్లి శ్రీను సమర్పించిన అర్జీలో హోమ్‌గార్డు మురళీపై ఫిర్యాదు చేశారు. తన సరిహద్దులో ఇష్టారాజ్యంగా మురళి ప్రవర్తిస్తున్నాడని, అదేమిటని అడిగితే దుర్భాషలాడుతున్నాడని ఫిర్యాదులో పేర్కొన్నారు.

పన్నులు చెల్లించి అభివృద్ధికి సహకరించండి

-మునిసిపల్ మంత్రి పొంగూరు నారాయణ



రోడ్డును ప్రారంభించి ముందుకు సాగుతున్న మంత్రి నారాయణ, ఎమ్మెల్యేలు బోడె ప్రసాద్, సుజనా చౌదరి, కామినేని శ్రీనివాస్

పెనమలూరు, నవంబరు11(ఆంధ్రజ్యోతి): తాడిగడప మునిసిపాలిటీలో ఆదాయం కేవలం రూ.20 కోట్లు మాత్రమే ఉందని, సరిగ్గా పన్నులు వసూలు చేస్తే వందకోట్లు సమకూరతాయని, దీనికి స్వచ్ఛందంగా భవన యజమానులు పన్నులు చెల్లించి సహకరించాలని మునిసిపల్ మంత్రి పొంగూరు నారాయణ కోరారు. సోమవారం సిద్ధార్థ అకాడమీ పైవంతెన రోడ్డు ప్రారంభోత్సవ కార్యక్రమానికి హాజరైన మంత్రి నారాయణ మాట్లాడుతూ తీవ్ర ఆర్థిక ఇబ్బందుల్లో రాష్ట్రం ఉన్నా సీఎం చంద్రబాబు అనుభవంతో నిధులు సమకూర్చి అభివృద్ధి కార్యక్రమాలు దశలవారీగా చేపడుతున్నామని చెప్పారు. గత ప్రభుత్వంలో మునిసిపాలిటీల ఆస్తి, నీటి తదితర పన్నులను డైవర్ట్ చేసి 3,200 కోట్లను వాడేశారని దుయ్యబట్టారు. చట్టప్రకారం లోకల్ బాడీలకు వచ్చే పన్నులను కౌన్సిల్ తీర్మానాల ద్వారా అక్కడే అభివృద్ధి పనులకు వాడుకోవాలని చెప్పారు. ఎమ్మెల్యే బోడె ప్రసాద్ కోరిక మేరకు పంట కాల్వ రోడ్డును గంగూరు వరకు మరో మూడున్నర కిలోమీటర్లు పొడిగించేందుకు వెంటనే సీఆర్‌డీఏకు ఆదేశాలు ఇస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో స్థానిక ఎమ్మెల్యే బోడెప్రసాద్, విజయవాడ పశ్చిమ ఎమ్మెల్యే సుజనా చౌదరి, కైకలూరు ఎమ్మెల్యే కామినేని శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

అంగరంగ వైభవంగా అయ్యప్ప పడిపూజ



అయ్యప్ప పడిపూజ చేస్తున్న గురుస్వామి మురళీధర్ నంబూద్రి చిత్రంలో హరివిల్లు ఫౌండర్, చైర్మన్ లక్షణ్ చౌదరి దంపతులు

ఆటోనగర్, నవంబరు 11(ఆంధ్రజ్యోతి): హరివిల్లు ప్రమోటర్స్ అండ్ డెవలపర్స్ ప్రైవేటు లిమిటెడ్ ఫౌండర్, చైర్మన్ వేములపల్లి లక్షణ్ చౌదరి ఆధ్వర్యంలో పటమట హరివిల్లు కార్పొరేట్ ఆఫీసు వద్ద అయ్యప్ప స్వామి పడిపూజ సోమవారం అంగరంగ వైభవంగా నిర్వహించారు. గొల్లపూడి అయ్యప్ప స్వామి ఆలయ గురుస్వామి మురళీధర్ నంబూద్రి చేతుల మీదుగా పడిపూజామహోత్సవం జరిగింది. కోనసీమ జిల్లా అంబాజీపేటకు చెందిన సంగీత స్వరనిధి నేషనల్ అవార్డు గ్రహీత రాజేష్ అయ్యప్పస్వామి మధుర గీతాలతో అలరించారు. ముఖ్యఅతిథిగా మంత్రి కొల్లు రవీంద్ర, తూర్పు నియోజకవర్గ ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్, పెనమలూరి నియోజకవర్గ ఎమ్మెల్యే బోడె ప్రసాద్, మడకశిర ఎమ్మెల్యే, టీటీడీ బోర్డు మెంబర్ ఎం.ఎస్ రాజు పాల్గొని అయ్యప్పస్వామి పడిపూజను తిలకించారు. కృష్ణాజిల్లా నలుమూలల నుంచి అయ్యప్ప దీక్షాదారులు పాల్గొని స్వామిని సేవించి తరించారు. ఈ కార్యక్రమాన్ని హరివిల్లు టీమ్ వేల్పుల రమేష్‌బాబు, మోదుకూరి గంగాధర్ తదితరులు పర్యవేక్షించారు.

పాండురంగ స్వామి బ్రహ్మోత్సవాలు ప్రారంభం



మచిలీపట్నం టౌన్, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): మచిలీపట్నం చిలకలపూడి పాండురంగ స్వామి వారి బ్రహ్మోత్సవాలు సోమవారం వైభవంగా ప్రారంభమయ్యాయి. గణపతి పూజ, విఠల్‌కోటి పూజలు నిర్వహించారు. గణపతిహోమం జరిపారు. పల్లకి ఉత్సవం అంగరంగ వైభవంగా జరిపారు. మంగళవారం సామూహిక సత్యనారాయణ స్వామి వ్రతాలు, రాత్రికి రుక్మిణీ పాండురంగ స్వామి వారి కళ్యాణం జరుగనుంది. 13న ద్వాదశ పారాయణ కార్యక్రమం నిర్వహిస్తారు. ఉదయం 8 నుంచి పాండురంగ స్వామి వారిని ఏనుగు అంబారీపై నగరవీధుల్లో రాత్రి వరకు ఊరేగిస్తారు. 14వ తేదీ గురువారం సహస్రలింగేశ్వరస్వామికి అభిషేకాలు, విష్ణుసహస్ర నామ పారాయణ జరుగుతుంది. రాత్రి సహస్ర దీపారాధనలు, కోలాటలు, పండరీ భజనలు జరుగుతాయి. 15న రుక్మిణి అమ్మవారికి కుంకుమ పూజలు జరుగుతాయి. పౌర్ణమి సందర్భంగా మంగినపూడి బీచ్‌లో సముద్ర స్నానాలు చేసిన భక్తులు పాండురంగ స్వామి వారిని దర్శించుకునేందుకు వేలాది భక్తులు వస్తారు. కార్యక్రమాలను మంత్రి కొల్లు రవీంద్రతో పాటు ఆహ్వాన కమిటీ ప్రతినిధులు, గోల్డ్ ప్రిన్స్ అధినేత చలమలశెట్టి నరసింహారావు తదితరులు పర్యవేక్షిస్తున్నారు.

కేఈబీ కెనాల్‌లోకి దూసుకెళ్లిన లారీ

ప్రాణభయంతో దూకేసిన డ్రైవర్

ప్రమాదవశాత్తు లారీ చక్రాల కింద పడి దుర్మరణం





కేఈబీ కెనాల్‌లోకి దూసుకెళ్లిన లారీ (ఇన్‌సెట్) లారీ డ్రైవర్ దివాకర్ (ఫైల్)

ఘంటసాల, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): కేఈబీ కెనాల్‌లోకి లారీ దూసుకెళ్లి డ్రైవర్ మృతి చెందిన ఘటన ఘంటసాల మండలం పాపవినాశనం గ్రామ రెవెన్యూ పరిధిలో సోమవారం జరిగింది. వివరాల్లోకి వెళితే... శ్రీకాకుళం వైపు నుంచి అవనిగడ్డ వైపునకు వెళ్తున్న లారీ పాపవినాశనం సమీపంలోకి రాగానే ఒక్కసారి అదుపు తప్పి కేఈబీ కెనాల్‌లోకి దూసుకెళ్లింది. భయపడిన డ్రైవర్ గొరుముచ్చు దివాకర్ (54) లారీలో నుంచి బయటకు దూకేశాడు. ఈ క్రమంలో ప్రమాదవశాత్తు అదే లారీ చక్రాల కింద పడి మృతి చెందాడు. విషయం తెలుసుకున్న ఘంటసాల ఎస్ఐ ప్రతాప్ రెడ్డి ఘటనా స్థలానికి చేరుకుని వివరాలు సేకరించారు. మృతుడు అవనిగడ్డ మండలం బందలాయిచెరువు గ్రామవాసిగా గుర్తించారు. మృతునికి భార్య, ఇద్దరు కుమారులు ఉన్నారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

తీరాన్ని తవ్వేస్తున్నారు..!

(5వ పేజీ తరువాయి)

తీసుకుంటామని తహసీల్దార్ మీడియాలో విస్తృతంగా ప్రచారం చేశారు. కానీ, రెవెన్యూ యంత్రాంగంలోని కిందిస్థాయి సిబ్బంది ప్రోత్సాహంతో మోపిదేవి మండలం కోసూరువారిపాలెం, కె.కొత్తపాలెం గ్రామాల్లో పెద్ద ఎత్తున ఇసుక అక్రమ రవాణా జరుగుతోంది.

- అవనిగడ్డ మండలం తుంగలవారిపాలెం, పాత ఎడ్లంక గ్రామాల సమీపంలో కృష్ణానది పరివాహక ప్రాంతం కోతకు గురవుతూ జనావాసాలు కృష్ణానదిలో కలసిపోతున్నప్పటికీ ఇసుక అక్రమ రవాణాదారులను అడ్డుకోవాల్సిన యంత్రాంగం రాజకీయ పలుకబడితో చోద్యం చూస్తోందన్న ఆరోపణలు వస్తున్నాయి. కోడూరు మండలం విశ్వనాథపల్లి కొత్తపాలెం, కుమ్మరిపాలెం, ఉల్లిపాలెం గ్రామాల నుంచి నిత్యం పదుల సంఖ్యలో ట్రాక్టర్లను పెట్టి వందలాది క్యూబిక్ మీటర్ల ఇసుక తరలిస్తున్నారు.

సీఆర్‌జెడ్ నిబంధనలు పట్టవా..?

నాగాయలంక మండలం గుల్లలమోద, కోడూరు మండలం హంసలదీవి మొదలు చల్లపల్లి మండలం వెలివోలు వరకు ఉన్న కృష్ణానది పరివాహక ప్రాంతం మొత్తం కోస్టల్ రెగ్యులేటరీ జోన్ (సీఆర్‌జెడ్) పరిధిలోకి వస్తుంది. ఈ ప్రాంతంలో ఎలాంటి తవ్వకాలు చేపట్టరాదని కేంద్ర పర్యావరణ మంత్రిత్వ శాఖ, నేషనల్ గ్రీన్ ట్రిబ్యునల్ స్పష్టమైన ఆదేశాలిచ్చినప్పటికీ అధికారులు పట్టనట్టు వ్యవహరిస్తున్నారు.

ఇదేం ఇసుక పాలసీ

కొత్త ఇసుక పాలసీ ప్రకారం.. స్థానికంగా ఉండే రేవుల నుంచి ఇసుకను తరలించుకోవచ్చని, అందుకోసం జిల్లాస్థాయి శాండ్ కమిటీ నియమించాలని, ఎలాంటి సందర్భాల్లో, ఎక్కడి నుంచి ఇసుక తెచ్చుకోవాలన్న విషయమై స్పష్టమైన ఆదేశాలిచ్చారు. అయితే, కలెక్టర్ బాలాజీ ఇచ్చిన ఆదేశాల్లో స్థానికంగా అందుబాటులో ఉన్న నదుల నుంచి ఇసుకను తరలించవచ్చని పేర్కొన్నారు. ఈ విషయాన్ని దృష్టిలో ఉంచుకుని రెవెన్యూ అధికారులు ఇష్టారీతిన తవ్వకాలు సాగిస్తున్నారు. అయితే, కలెక్టర్ ఇచ్చిన అవే ఆదేశాల్లో.. సమీపంలోని ప్రభుత్వం అనుమతి ఇచ్చిన రీచ్‌ల నుంచే ఇసుకను తీసుకొచ్చుకోవాలని సూచించిన విషయాన్ని మాత్రం పక్కన పెట్టేస్తున్నారు.

మేట తొలగింపునకు అష్టకష్టాలు

ఇటీవల కృష్ణానదికి వచ్చిన భారీ వరదల కారణంగా విజయవాడ మొదలు జిల్లాలోని చిట్టచివరి ప్రాంతాలైన నాగాయలంక, కోడూరు మండలాల్లోని లంక భూముల్లో పెద్ద ఎత్తున ఇసుక మేట వేసింది. ఈ మేటను తొలగించేందుకు రెవెన్యూ అనుమతులు ఇవ్వటంలో తీవ్ర జాప్యం చేస్తోందని రైతులు చెబుతున్నారు. ఓవైపు తమ కళ్లముందే ఎలాంటి అనుమతులు లేకుండా ఇసుక తరలించుకుపోతుండగా, తమ భూముల్లో ఏర్పడిన మేటను తొలగించుకునేందుకు తమకెందుకు ఈ ఇబ్బందులు అని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

దారులకు గండ్లు

ఇసుక మాఫియా రాత్రి సమయాల్లో లంక భూముల్లోని పంట పొలాల మీదుగా వెళ్లి నదిలోని ఇసుకను తవ్వేస్తుండగా, దీని కారణంగా తమ భూములకు ఇబ్బంది ఎదురవుతోందని చెబుతూ పలుచోట్ల రైతులు, తీర గ్రామాల ప్రజలు నదిలోకి వెళ్లే బాటకు గండ్లు కొడుతున్నారు. ఘంటసాల మండలం పాపవినాశనం వద్ద, సూరపనేనివారిపాలెం గ్రామస్థుల లంకకు వెళ్లే దారి, నిమ్మగడ్డ లంక భూములకు వెళ్లే దారిలో స్థానిక రైతులు, గ్రామస్థులు దారులకు గండ్లు కొట్టారు. అయినా ఆగని ఇసుక మాఫియా కొత్తదారులు వెతుక్కుంటోంది.

వాలీబాల్ జాతీయ పోటీలకు చల్లపల్లి విద్యార్థిని



కుంచె దివ్య

చల్లపల్లి, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి) : వాలీబాల్ జాతీయస్థాయి పోటీలకు చల్లపల్లి మండలం లక్ష్మీపురం శివారు రామానగరానికి చెందిన కుంచె దివ్య ఎంపికైంది. త్వరలో జరుగనున్న అండర్ - 14 జాతీయ వాలీబాల్ పోటీలకు రాష్ట్ర ప్రాబబుల్స్ జట్టులోకి దివ్యను ఎంపికచేశారు. చల్లపల్లి రాజా హైస్కూల్‌లో దివ్య తొమ్మిదవ తరగతి చదువుతోంది. విజయనగరంలో నిర్వహిస్తున్న సెలక్షన్స్ ద్వారా ప్రాబబుల్స్ జట్టులో స్థానం దక్కించుకుంది.

స్టేట్ అండర్-17 బాలికల హ్యాండ్‌బాల్ విజేతగా కృష్ణా



విజేతలకు ట్రోఫీ అందిస్తున్న హెచ్ఎం ఎస్తేరు రాణి

విజయవాడ స్పోర్ట్సు, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి) : నగరంలోని పటమట బాలుర ఉన్నత పాఠశాల క్రీడామైదానంలో మూడు రోజులుగా ఉత్కంఠ భరితంగా సాగుతున్న ఏపీ స్టేట్ అండర్-17 హ్యాండ్‌బాల్ బాలికల చాంపియన్‌షిప్‌లో ఉమ్మడి కృష్ణా విజేతగా అవతరించింది. రన్నరప్‌గా శ్రీకాకుళం నిలవగా, విజయనగరం తృతీయ స్థానంలో నిలిచింది. పోటీల అనంతరం విజేతలకు ట్రోఫీలు, మెడల్స్ బహూకరించారు. పాఠశాల హెచ్ఎం ఎస్తేరురాణి, లయన్స్ క్లబ్ జ్యూరి మిరియాల వెంకటేశ్వరరావు, స్టాఫ్ సెక్రటరీ షేక్ లాల్ మధు, సీనియర్ ఉపాధ్యాయులు శారద, గోపాలకృష్ణ, అండర్-17 స్కూల్ గేమ్స్ ఆర్గనైజింగ్ సెక్రటరీ ఎల్.దుర్గారావు పాల్గొన్నారు.

సీఎం చంద్రబాబును కలిసిన కార్పొరేషన్ల చైర్మన్లు



విజయవాడ, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): టీడీపీ అధినేత, సీఎం చంద్రబాబు నాయుడును ఆయన నివాసంలో సోమవారం టీడీపీ జాతీయ అధికార ప్రతినిధి, స్వచ్ఛాంధ్ర మిషన్ చైర్మన్ కొమ్మారెడ్డి పట్టాభిరామ్, ఆర్యవైశ్య కార్పొరేషన్ చైర్మన్ డూండి రాకేష్ ఇంకా పలు కార్పొరేషన్ల చైర్మన్లు మర్యాద పూర్వకంగా కలిశారు. తమను కార్పొరేషన్లకు చైర్మన్లుగా నియమించినందుకు చంద్రబాబుకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా తనకు కృతజ్ఞతలు తెలిపిన పట్టాభిరామ్‌తో చంద్రబాబు మాట్లాడుతూ బాగా పని చేయాలని, తన మద్దతు ఎప్పుడూ ఉంటుందని భరోసా ఇచ్చారు.

సీఎం కుటుంబ సభ్యులపై అసభ్యకర పోస్టింగ్

విజయవాడ, నవంబరు 11(ఆంధ్రజ్యోతి) : సీఎం చంద్రబాబు, ఆయన కుటుంబ సభ్యులపై సామాజిక మాధ్యమాల్లో అసభ్యకరంగా పోస్టింగ్ లు పెట్టిన వ్యక్తిపై పటమట పోలీసులు కేసు నమోదు చేశారు. కడపకు చెందిన పర్వత సుధాకర్‌రెడ్డి సామాజిక మాధ్యమాల్లో చంద్రబాబును, ఆయన కుటుంబ సభ్యులను టార్గెట్ చేసుకుని ఇష్టానుసారంగా పోస్టింగ్‌లు పెడుతున్నాడు. దీనిపై పటమటకు చెందిన షేక్ నజీర్ అనే టీడీపీ కార్యకర్త పోలీసులకు ఫిర్యాదు చేశాడు. దీనిపై సోమవారం కేసు నమోదు చేశారు.

జాతీయ రహదారిపై కారు దగ్ధం



రాణిగారితోట, నవంబరు11 (ఆంధ్ర జ్యోతి): కృష్ణలంక జాతీయ రహదారిపై వారధి వద్ద ఒక కారు అగ్నికి ఆహుతి అయ్యింది. కుంచనపల్లికి చెందిన విజయశేఖరబాబు అనే వ్యక్తి బంధువులను పెజ్జోనిపేటలో దించేందుకు రినాల్ట్ లాడ్జి కారులో రాత్రి 11 గంటలకు బయలుదేరాడు. కారు వారధి దాటిన తరువాత కృష్ణలంక జాతీయ రహదారి సర్కిల్ లోని పోలీస్ అవుట్ పోస్ట్ వద్దకు రాగానే కారు నుంచి వాసన రావటంతో పాటు కారు ఒక్కసారిగా ఆగిపోయింది. వెంటనే కారు నుంచి మంటలు చెలరేగటంతో కారులో ఉన్న నలుగురు దిగి సురక్షితంగా బయటపడ్డారు. ఈ ప్రమాదంలో కారు పూర్తిగా అగ్నికి ఆహుతి అయ్యింది.

జాబ్‌మేళాలో 18 మంది ఎంపిక

ఉయ్యూరు, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి) : ఏపీ నైపుణ్యాభివృద్ధి సంస్థ, జిల్లా ఉపాధికల్పనశాఖ, డీఆర్‌డీఏ - సీడాప్, నేక్ సెంటర్ ఆధ్వర్యంలో స్థానిక నేక్ సెంటర్‌లో సోమవారం నిర్వహించన జాబ్‌మేళాలో వివిధ కంపెనీల్లో ఉద్యోగాలకు 18 మంది ఎంపికైనట్టు జిల్లా ఒకేషనల్ ఉపాధి కల్పన అధికారి సత్యబ్రహ్మం, జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి పి.నరేశ్ కుమార్ తెలిపారు. బీజెడ్‌ఫ్సిర్వ్ ప్రైవేట్ లిమిటెడ్, పేటీఎం వంటి కంపెనీల ప్రతినిధులు హాజరై 35 మందికి ఇంటర్వ్యూలు నిర్వహించగా 18మంది ఎంపికైనట్టు తెలిపారు. ఈ ఎంపికల్లో నైపుణ్యాభివృద్ధి సంస్థ జిల్లా నియామక అధికారి తుర్లపాటి మధు, నేక్ సెంటర్ ఇన్‌చార్జ్ రవిసుధాకర్, వై. చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.



గ్రంథాలయ సంస్థ చైర్మన్ గోనుగుంట్లకు అభినందనలు తెలుపుతున్న టీడీపీ నేతలు పాలడుగు బాలాజీ, భాస్కర్

గ్రంథాలయ సంస్థ చైర్మన్ గోనుగుంట్లకు అభినందన

ఉయ్యూరు, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి) : ఆంధ్రప్రదేశ్ గ్రంథాలయ సంస్థ చైర్మన్‌గా నియమితుడైన గోనుగుంట్ల కోటేశ్వరరావుకు ముదునూరు టీడీపీ నాయకులు అభినందనలు తెలిపారు. రామలింగేశ్వరస్వామి ఆలయ ట్రస్టుబోర్డు మాజీ చైర్మన్ పాలడుగు బాలాజీ ఆధ్వర్యంలో భాస్కర్, పలువురు పార్టీ నాయకులు గోనుగుంట్లను సోమవారం కలసి పుష్పగుచ్ఛం అందజేసి సత్కరించారు.

పిచ్చయ్య మృతదేహం లభ్యం

కంకిపాడు, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి) : బందరు కాలువలో పడి గల్లంతైన పూలకొట్టు పిచ్చయ్య మృతదేహం లభ్యమైంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఈ నెల 9వ తేదీ రాత్రి కంకి పాడుకు చెందిన పూలకొట్టు పిచ్చయ్య బందరు కాలువలో పడి గల్లంతైన విషయం తెలిసిందే. రెండు రోజులుగా పోలీసులు, రెవెన్యూ అధికాలు ఎన్డీఆర్‌ఎఫ్ బృందం సహకారంతో గాలింపు చర్యలు చేపట్టారు. సోమవారం ఉదయం బందరు కాలువలోనే మృతదేహం లభ్యమైంది. మృతదేహా న్ని పోస్టుమార్టం కోసం ఉయ్యూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. కేసు నమోదు చేసి విచారిస్తున్నట్లు ఎస్సై సందీప్ తెలిపారు.

శివాలయానికి రూ.25వేలు విరాళం

హనుమాన్‌జంక్షన్, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి) : స్థానిక ధర్మకోనేరు చెరువు గట్టుపై ఏర్పాటు చేసిన భ్రమరాంబ సమేత శ్రీశైల మల్లికార్జున స్వామి దేవాలయ అభివృద్ధికి స్థానిక లయన్స్‌క్లబ్ నాయకులు ఈలప్రోలు చంద్రశేఖర్, వెంకటనాగలక్ష్మి దంపతులు సోమవారం రూ.25వేలు విరాళాన్ని అందించారు. ఆలయ కమిటీ సభ్యులు కొల్లి వెంకట్రావుకు విరాళాన్ని అందజేశారు. కార్యక్రమంలో లయన్స్ నాయకులు నందిగం స్వామి, తాడి రంగారావు తదితరులు పాల్గొన్నారు.

పీవీపీ సిద్ధార్థలో ల్యాండ్ సర్వే శిక్షణ ప్రారంభం

పెనమలూరు, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి) : టోటల్ స్టేషన్ ల్యాండ్ సర్వే శిక్షణ కార్యక్రమం పీవీపీ సిద్ధార్థ ఇంజనీరింగ్ కళాశాలలో సోమవారం ప్రారంభమైంది. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ డాక్టర్ కే శివాజీ బాబు మాట్లాడుతూ, రాబోయే రోజుల్లో సివిల్ ఇంజనీరింగ్ రంగంలో సర్వేకు అత్యంత ప్రాధాన్యత ఉందని, భవనాలు, రోడ్ల నిర్మాణంలో ఈ శిక్షణ ఉపయోగపడనుందని తెలిపారు. ఈ నెల 15 వరకు ఈ కార్యక్రమం కొనసాగనుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో కోగంటి శ్యామ్ ప్రకాష్, విద్యార్థులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



కలాం చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న లయన్స్ క్లబ్ జోనల్ చైర్‌పర్సన్ ఇస్మాయిల్

ఘనంగా జాతీయ విద్యా దినోత్సవం

ఉయ్యూరు, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి) : భారత తొలి విద్యాశాఖ మంత్రి మౌలానా అబుల్ కలాం అజాద్ జయంతి పురస్కరించుకొని సోమవారం జాతీయ విద్యా దినోత్సవాన్ని లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. క్లబ్ జోనల్ చైర్ పర్సన్ ఎండీ ఇస్మాయిల్ కార్యాలయంలో అజాద్ చిత్రపటానికి క్లబ్ అధ్యక్షుడు నేరెళ్ల తేజ, ముఖ్య అతిథి విశ్రాంత ప్రధానోపాధ్యాయుడు హసన్ అహ్మద్ పూలమాలవేసి ఘనంగా నివాళులర్పించారు. తేజ ఫౌండేషన్ బాధ్యుడు నేరెళ్ల వేణు జోనల్ చైర్‌పర్సన్ ఇస్మాయిల్, ఉర్దూ స్కూల్ హెచ్‌ఎం సిలార్, క్లబ్ సెక్రటరీ రాంబాబు, సభ్యులు నల్లా శ్రీనివాసరావు, పూర కిశోర్‌కుమార్ పాల్గొన్నారు.

కాశీ విశ్వేశ్వర వీరభద్రస్వామి దేవస్థానంలో షెడ్డు ప్రారంభం

కంకిపాడు, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని ఈడుపుగల్లు కాశీ విశ్వేశ్వర వీరభద్రస్వామి దేవస్థానంలోని సువిశీలమైన ప్రాంగణంలో రూ. 15 లక్షలతో ఏర్పాటు చేసిన షెడ్డును ఎన్‌ఆర్‌ఐ రాజేష్‌కుమార్ సోమవారం ప్రారంభించారు. వెల్లంకి సుబ్బయ్య, రామశేషయ్య దంపతులు జ్ఞాపకార్థం కుమార్తె వి. విజయలక్ష్మి, ఉమామహేశ్వరరావు ఏర్పాటు చేసిన ఈ షెడ్డును ప్రారంభించటం ఎంతో ఆనందంగా ఉందని రాజేష్ కుమార్ తెలిపారు.



ప్రారంభించిన షెడ్డు

అభివృద్ధే కూటమి ప్రభుత్వ లక్ష్యం

కానూరులో రోడ్ల నిర్మాణానికి శంకుస్థాపన కార్యక్రమంలో మంత్రి నారాయణ



కానూరులో రోడ్ల నిర్మాణానికి శంకుస్థాపన శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తున్న మంత్రి నారాయణ, ఎమ్మెల్యేలు బోడె ప్రసాద్, సుజనా చౌదరి, కామినేని శ్రీనివాస్

పెనమలూరు, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి) : అభివృద్ధే లక్ష్యంగా కూటమి ప్రభుత్వం పని చేస్తుందని మంత్రి నారాయన అన్నారు. కానూరులో రోడ్ల నిర్మాణానికి మంత్రి నారాయణ సోమవారం శంకుస్థాపన చేశారు. రూ.3 కోట్లతో కానూరు ప్రధాన రోడ్డు, అమరావతి కాలనీ రోడ్డు, వృద్ధుల ఆశ్రమం రోడ్డు, డ్రెయిన్ల నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. కానూరులో డ్రెయిన్లను పరిశీలించిన మంత్రి చలించిపోయారు. ఈ ప్రాంత అభివృద్ధికి తాను సహకరిస్తానని స్థానిక ఎమ్మెల్యే బోడె ప్రసాద్‌కు హామీ ఇచ్చి అతి తక్కువ కాలంలో వంతెనను ప్రజలకు అందుబాటులోకి తీసుకురావడంపై అభినందించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే బోడె ప్రసాద్ మాట్లాడుతూ, కొత్తగా ఏర్పడిన తాడిగడప మునిసిపాలిటీలో గత ప్రభుత్వం అభివృద్ధిని ఏవిధంగా నిర్లక్ష్యం చేసిందో వివరించారు. కనీస మౌలిక వసతులైన రోడ్లు, డ్రెయిన్లు వీధిలైట్ల ఏర్పాటుకు సహకరించాలని మంత్రిని అభ్యర్థించారు. నెలరోజుల్లో లక్షమంది ప్రయాణించే యనమలకుదురు రోడ్డును పూర్తిచేస్తానని హామీ ఇచ్చారు. విజయవాడ వెస్ట్ ఎమ్మెల్యే సుజనా చౌదరి మాట్లాడుతూ, తాను ఎంపీగా ఉన్న కాలం నుంచే మంత్రి నారాయణ, ఎమ్మెల్యే బోడె ప్రసాద్‌తో సత్సంబంధాలు ఉన్నాయని, తాడిగడప అభివృద్ధికి తనవంతు కృషి అందిస్తానని పేర్కొన్నారు. కార్యక్రమంలో కైకలూరు ఎమ్మెల్యే కామినేని శ్రీనివాస్, సిద్ధార్థ అకాడమీ సెక్రటరీ పాలడుగు లక్ష్మణరావు, మునిసిపల్ కమిషనర్ భవానీ ప్రసాద్, కూటమి నాయకులు పాల్గొన్నారు.

74 మద్యం సీసాలు స్వాధీనం



పోలీసులు స్వాధీనం చేసుకున్న మద్యం సీసాలు

గన్నవరం, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి) : మద్యం బెల్టు షాపులను నిర్వహించటం నేరమని ఎన్‌ఫోర్స్‌మెంట్ ఎస్సై ఎలియాజర్ అన్నారు. మండలంలోని సూరంపల్లి, చనుపల్లి వారిగూడెం, సావరగూడెం, కోనాయి చెరువు, బాపులపాడు మండలం రంగన్నగూడెంలో సోమవారం అక్రమమద్యం విక్రయిస్తున్న, నలుగురిని పట్టుకుని వారి వద్ద నుంచి 74 మద్యం సీసాలను స్వాధీనం చేసుకున్నట్టు తెలిపారు. వారిపై కేసులు నమోదు చేశామన్నారు. ఎక్సైజ్ సీఐ సురేఖ, ఎస్సై అల్లూరయ్య, హెడ్ కానిస్టేబుల్ పాండురంగబాబు తదితరులు పాల్గొన్నారు.

బాలికను అపహరించిన యువకుడి అరెస్టు

హనుమాన్‌జంక్షన్, నవంబరు11 (ఆంధ్రజ్యోతి): మైనర్ బాలికను అపహరించి అసభ్యకరంగా ప్రవర్తించిన యువకుడిని పోక్సో చట్టం కింద సోమవారం వీరవల్లి పోలీసులు అరెస్టు చేసి నూజివీడు కోర్టులో హాజరు పరిచారు. ఎస్సై శ్రీనివాసరావు తెలిపిన వివరాల ప్రకారం.. వీరవల్లి గ్రామానికి చెందిన షేక్ అజ్మీర్ ఆదే గ్రామానికి చెందిన మైనర్ బాలికను అపహరించి అసభ్యకరంగా ప్రవర్తించాడు. బాలిక తల్లిదండ్రులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి నిందితుడిని అరెస్టు చేసి నూజివీడు కోర్టులో హాజరు పరిచినట్లు తెలిపారు. కోర్టు 14 రోజులు రిమాండ్ విధించింది.

వరద బాధితులకు నష్టపరిహారం అందించాలి



వెల్దిపాడు గ్రామ సచివాలయం ఎదుట ఆందోళన చేస్తున్న సీపీఎం నాయకులు

ఉంగుటూరు, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి) : బుడమేరు వరదలకు నీటమునిగిన ఇళ్లకు నష్టపరిహారం అందనివారికి సత్వరమే పరిహారం అందించాలని సీపీఎం మండల కమిటీ ఆధ్వర్యంలో నాయకులు, ముంపు బాధితులు సోమవారం వెల్దిపాడు గ్రామ సచివాలయం వద్ద ధర్నా నిర్వహించారు. సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు టీవీ లక్ష్మణస్వామి, ఆ పార్టీ మండల కార్యదర్శి అజ్మీర్ వెంకటేశ్వరరావు ,శీకాకుళం వెంకటేశ్వరరావు, కుంపటి విజయకుమారి, వంగపండు సుమలత, బొకినాల నాగరాజు, మట్టా భారతమ్మ, బంద్రపల్లి సుధాకర్, తదితరులు పాల్గొన్నారు.

ఆధార్ కార్డు అందజేత



వెంకటేశ్వరరావుకు ఆధార్ కార్డు అందజేస్తున్న సర్పంచ్ శ్రీనివాస్

గన్నవరం, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని సూరంపల్లి గ్రామానికి చెందిన రామెళ్ల వెంకటేశ్వరరావు మోకాళ్ల నొప్పులతో బాధపడుతూ ఇంటి వద్దనే ఉంటున్నాడు. అతనికి సుమా రు 66 ఏళ్ల వయస్సు ఉంటుంది. గత 6ఏళ్ల క్రితం తన ఆధార్ కార్డును పోగొట్టుకున్నాడు. ఈ నేపథ్యంలో టీడీపీ మండల అధ్యక్షుడు జాస్తి వెంకటేశ్వరరావు, గ్రామంలోకి వెళ్లినప్పుడు రామెళ్ల వెంకటేశ్వరరావు కలసి తన గోడు వెళ్లబోసుకున్నాడు. ఆధార్ కార్డు లేదని, దీంతో పెన్షన్ రావటం లేదని చెప్పాడు. వెంటనే స్పందించిన జాస్తి వెంకటేశ్వరరావు టీడీపీ కార్యకర్తకు బాధ్యత అప్పగించారు. ఆయన అతని పేరు, తండ్రి పేరు, పిన్ కోడ్ సహాయంతో ఆధార్ డేటా బేస్ నందు ఆధార్ కార్డును పరిశోధించి కొత్త ఆధార్ కార్డు ఇప్పించారు. ఆ కార్డును సోమవారం సర్పంచ్ ఈలప్రోలు శ్రీనివాస్ లబ్ధిదారుడికి అందజేశారు.

లక్ష్యంతో భవిష్యత్తుకు బాట వేసుకోవాలి



విద్యార్థులకు ప్రశంసాపత్రాలు అందిస్తున్న మానవత సంస్థ రాష్ట్ర అధ్యక్షుడు మారుబోయిన

హనుమాన్‌జంక్షన్, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): ప్రాథమికస్థాయి నుంచి విద్యార్థులు లక్ష్యాన్ని ఏర్పరచుకొని భవిష్యత్తుకు బంగారు బాటను వేసుకోవాలని మానవత రాష్ట్ర అధ్యక్షుడు మారుబోయిన కోటేశ్వరరావు అన్నారు. సోమవారం స్థానిక ఏలూరు రోడ్డులోని అప్పనవీడు జడ్పీ హైస్కూల్‌లో విద్యార్థులకు నైతిక విలువలు, వ్యక్తిత్వ వికాసంపై కెరీర్ గైడెన్స్ తరగతులు నిర్వహించారు. గతేడాది పాఠశాలలో 6,7,8,9 తరగతుల్లో ప్రథమ, ద్వితీయ స్థానం సాధించిన విద్యార్థులకు రూ.1000, రూ.500లు పారితోషికం అందించారు. పారితోషికంతో పాటు ప్రశంసాపత్రం అందించి విద్యార్థులను అభినందించారు. ఈ కార్యక్రమంలో మానవత సభ్యులు కొట్నేని రామచంద్రరావు, ఘంటా సత్యనారాయణ, వడ్డి రాజేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

నిరవధికంగా అయ్యప్పలకు అన్నసంతర్పణ

హనుమాన్‌జంక్షన్, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి) : స్థానిక ఏలూరు రోడ్డులోని దుర్గాదేవి ఆలయ సన్నిధిలో టీడీపీ నేత వేమూరి శ్రీనివాసరావు ఆధ్వర్యంలో దాతల సహకారంతో నిర్వహిస్తున్న అయ్యప్ప భక్తులకు అన్నసంతర్పణ కార్యక్రమం సోమవారం నాటికి 27వ రోజుకు చేరింది. గత నెల 16న దెందులూరు ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్ ఈ శిబిరాన్ని ప్రారంభించారు. సోమవారం గ్రామానికి చెందిన పల్లెల దుర్గారావు, దుర్గవేణి దంపతులు అన్న సంతర్పణ చేశారు. ఈ కార్యక్ర మంలో వడ్డి వాసవీదేవి, బోయపాటి దీప్తు, చెరుకూరి ప్రసాద్ పాల్గొన్నారు.

ప్రజాపోరును జయప్రదం చేయండి

ఉంగుటూరు, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి) : ప్రజా సమస్యలపై కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అవలంబిస్తున్న విధానాలకు వ్యతిరేకంగా ఈ నెల 14న అన్ని మండల కార్యాలయాల వద్ద జరిగే ప్రజాపోరు ధర్నా కార్యక్రమాల్లో కర్షకులు, కార్మికులు, పేద, మధ్యతరగతి వర్గ ప్రజలందరూ పాల్గొని జయప్రదం చేయాలని సీపీఎం మండల కార్యదర్శి అజ్మీర్ వెంకటేశ్వరరావు పిలుపు నిచ్చారు. ప్రజాసమస్యల పరిష్కారానికై సీపీఎం ఆధ్వర్యంలో చేపట్టిన ఇంటింటా ప్రచార కార్యక్రమంలో భాగంగా సోమవారం ఆ పార్టీ నాయకులు లంకపల్లి, ముక్కపాడు గ్రామాల్లో పర్యటించి ప్రజా సమస్యలపై ముద్రించిన కరపత్రాలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో సీపీఎం నాయకులు జయరాజు, పేరతోటి సాంబశివరావు, రమేష్, సంజీవరావు, విష్ణు, ముసలయ్య, బసవారావు, దాసు, వేణు తదితరులు పాల్గొన్నారు.

విద్య, వైద్య రంగాలకు పెద్దపీట

కంకిపాడు, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి) : కూటమి ప్రభుత్వం ప్రవేశ పెట్టిన బడ్జెట్‌లో విద్య, వైద్య రంగాలకు పెద్దపీట వేసిందని టీడీపీ సీనియర్ నాయకులు తుమ్మలపల్లి హరికృష్ణ అన్నారు. స్థానిక విలేకరులతో సోమవారం ఆయన మాట్లాడుతూ, అసెంబ్లీ సమావేశాల్లో కూటమి ప్రభుత్వం ప్రవేశ పెట్టిన బడ్జెట్‌కు ప్రజల నుంచి మంచి స్పందన వచ్చిందన్నారు. పంచాయతీ రాజ్ శాఖతో పాటు ఆరోగ్య శాఖ, విద్యా శాఖలకు రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్‌లు అత్యధికంగా నిధులు కేటాయించటం హర్షణీయమన్నారు.

వైసీపీ ఎమ్మెల్యేలను సస్పెండ్ చేయాలి

అసెంబ్లీ సమావేశాలకు హాజరుకాని వైసీపీ ఎమ్మెల్యేలను స్పీకర్ సస్పెండ్ చేయాలని కంకిపాడు మాజీ ఎంపీపీ దేవినేని రాజా అన్నారు. స్థానిక విలేకరులతో సోమవారం ఆయన మాట్లాడుతూ, ప్రజా సమస్యలపై స్పందించాల్సిన ప్రతిపక్ష పార్టీ నాయకులు దుమ్మా కొట్టడం సిగ్గుచేటన్నారు. అసెంబ్లీ సమావేశాలకు హాజరు కాని వైసీపీ నాయకులను తక్షణం అసెంబ్లీ సమావేశాలను నుంచి సస్పెండ్ చేయాలన్నారు.



మాట్లాడుతున్న విద్యుత్ శాఖ విజిలెన్స్ ఈఈ కె.వెంకటేశ్వర్లు

అక్రమ విద్యుత్ వినియోగం నేరం

విజిలెన్స్ ఈఈ కె.వెంకటేశ్వర్లు

గన్నవరం, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి) : అక్రమ విద్యుత్‌ను వినియోగిస్తే చర్యలు తప్పవని విద్యుత్‌శాఖ విజిలెన్స్ ఈఈ కె.వెంకటేశ్వర్లు హెచ్చరించారు. స్థానిక సబ్‌స్టేషన్ పరిధిలోని 22 గ్రామాల్లో 41 బృందాలుగా ఏర్పడి విద్యుత్ విజిలెన్స్ ఆధ్వర్యంలో సోమవారం మెరుపుదాడులు నిర్వహించారు. స్థానిక విలేకరులతో విజిలెన్స్ ఈఈ వెంకటేశ్వర్లు మాట్లాడుతూ, 41 బృందాలు 2192 గృహ సర్వీసులు, 123 వాణిజ్య, 13 ఇండస్ట్రియల్ సర్వీస్‌లను తనిఖీ చేసినట్లు తెలిపారు. వాటిల్లో 167 సర్వీస్‌లకు అదనపులోడు 364 కేవీ మొత్తానికి రూ.7. 50లక్షలు అక్రమ విద్యుత్ వినియోగిస్తున్న ఇద్దరిని గుర్తించి రూ.50వేలు జరిమానా విధించామన్నారు. అక్రమ విద్యుత్ వాడకం సామాజిక నేరమని అలా చేస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామన్నారు. వినియోగదారులుందరూ విద్యుత్ శాఖకు సహకరించాలని కోరారు. అక్రమంగా విద్యుత్ వాడుతున్నట్లు అయితే 94408-12362, 94408-12363, 83310-14951 నెంబర్‌లకు సమాచారం ఇవ్వాలన్నారు. గుణదల ఈఈ పి.హరిబాబు, డీఈఈ రామ్మూర్తి నాయుడు, ఏఈ ఎం.వెంకటరాజు తదితరులు పాల్గొన్నారు.

కరాటేలో ఎస్‌ఆర్‌కే విద్యార్థుల ప్రతిభ



ప్రథమ బహుమతి సాధించిన విద్యార్థి పూజిత్‌ను అభినందిస్తున్న కళాశాల చైర్మన్ బోయపాటి అప్పారావు, ప్రిన్సిపాల్ ఏకాంబరం

ప్రసాదంపాడు, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి) : జేఎన్టీయూ కాకినాడ యూని వర్సిటీ ఆధ్వర్యంలో నిర్వహించిన సెంట్రల్ జోన్ కరాటే మెన్స్, ఉమెన్స్ టోర్నమెంట్ పోటీల్లో విజయవాడ రూరల్ మండలం ఎనికేపాడులోని ఎస్‌ఆర్‌కే ఇంజినీరింగ్ కళాశాల విద్యార్థులు ప్రతిభ కనబర్చి ప్రథమ బహుమతి సాధించారని కళాశాల చైర్మన్ బోయపాటి అప్పారావు తెలిపారు. సోమవారం ప్రతిభ కనబర్చిన విద్యార్థులను అధ్యాపకులకు అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఈ నెల 8న నరసాపురంలోని స్వర్ణాంధ్ర కాలేజీ ఆఫ్ ఇంజినీరింగ్ అండ్ టెక్నాలజీ కళాశాలలో సెంట్రల్ జోన్ కరాటే మెన్స్ ఉమెన్స్ పోటీలు నిర్వహించారన్నారు. కళాశాల విద్యార్థులు పి. పూజిత్, ఆర్.సాత్వికలు ప్రతిభ కనబర్చి బహుమతులు సాధించడంతో పాటు జేఎన్టీయూ కాకినాడ టీమ్ సెలక్షన్లో ఎంపికయ్యారని తెలిపారు. కళాశాల సెక్రటరీ బోయపాటి శ్రీకృష్ణ, ప్రిన్సిపాల్ ఎం.ఏకాంబరం నాయుడు, ఫిజికల్ డైరెక్టర్ శరత్‌లు విజేతలను అభినందించారు.

శివాలయాలకు కార్తీక శోభ





రామలింగేశ్వరస్వామి దేవస్థానంలో భక్తుల పూజలు.. బుద్ధవరంలో లక్షదీపోత్సవం

విజయవాడ కల్చరల్, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి) : శ్రీరామలింగేశ్వర స్వామి వారి దేవ స్థానంలో కార్తీకమాసం రెండో సోమవారం సందర్భంగా స్వామి వారికి ఉదయం 5 గంటల నుంచి 11 గంటలకు రుద్రాభిషేకాలు జరిగాయి. ఉదయం స్వామివారికి కళ్యాణం జరిగింది. అనంతరం స్వామివారికి ప్రత్యేక అలంకరణ జరిగింది. ఈ కార్యక్రమంలో అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని స్వామివారి తీర్థప్రసాదాలు స్వీకరించారు. సాయంత్రం ఆకాశదీపం, రాత్రి పంచహారతులు, స్వామివారి పల్లకీసేవ, ఉదయం నుంచి భక్తుల దీపారాధనలు అత్యంత కన్నుల పండుగగా చేశారు. ఈ కార్యక్ర మంలో దేవస్థాన ముఖ్య అర్చకులు జీఆర్‌వీ సాగర్, దేవస్థానం అర్చకులు కార్యక్రమాలు నిర్వహించారు. శ్రీ పార్వతీ సమేత రామలింగేశ్వర స్వామి చారిటబుల్ ట్రస్ట్ ఫౌండర్, ఆలయ అభివృద్ధి దాత సంగా నర్సింహారావు ఆధ్వర్యంలో ఉచిత ప్రసాదాలు అందజేశారు. ఆలయ ఏవో ఎన్.భవానీ పాల్గొన్నారు.

బుద్ధవరంలో లక్ష దీపోత్సవం

గన్నవరం : మండలంలోని బుద్ధవరం అభయాంజనేయ స్వామి వారి విగ్రహం వద్ద లక్ష దీపోత్సవ వేడుకలను కన్నుల పండుగగా నిర్వహించాడు. కార్తిక మాసం ఏకాదశి పర్వదినాన్ని పురస్కరించుకుని సోమవారం రాత్రి పెద్ద ఎత్తున మహిళా భక్తులు లక్ష ఒత్తులతో దీపాలను వెలిగించారు. దీపారాధన చేసి శివనామస్మరణం చేశారు. అయ్యప్పమాలదారులు, భవానీలు, శివమాలధారులు భక్తి పాటలతో భజన చేశారు. పూలతో శివలింగం ఆకృతి చేసి వాటి చుట్టూ దీపాలు వెలిగించటం ఆకర్షణగా నిలిచింది. ఆలయ కమిటీ వారు అయ్యప్ప, భవాని, శివమాలదారులకు, భక్తులకు అల్పాహారాన్ని ఏర్పాటు చేశారు.

ఉయ్యూరు సోమేశ్వరస్వామి ఆలయంలో..

ఉయ్యూరు : కార్తీకమాసం రెండవ సోమవారం పురస్కరించుకుని ఉయ్యూరు, మండల పరిధి గ్రామాల్లోని శివాలయాలు భక్తులతో కిక్కిరిసాయి. జగదాంబ సమేత సోమేశ్వరస్వామి ఆలయానికి వేకువ జాము నుంచి భక్తులు పెద్దయెత్తున తరలివచ్చి కార్తీక దీపారాధన చేసి పూజలు చేశారు. సాయిపురం శివాలయంలో జబర్లపూడి సర్పంచ్ సూరపనేని ప్రసాద్ ఆధ్వర్యంలో ప్రత్యేకపూజలు చేశారు. పలు శివాలయాల్లో సాయంత్రం కార్తీక దీపారాధనలు చేశారు. భక్తుల ఓం నమఃశివాయ నామస్మరణతో ఆలయాలు మార్మోగాయి.



ఉయ్యూరు శివాలయంలో కిక్కిరిసిన భక్తులు

బాపులపాడు మండలంలో..

హనుమాన్‌జంక్షన్ : కార్తీకమాసం రెండవ సోమవారం పురస్కరించుకొని మండలంలోని పలు శివాలయాల్లో తెల్లవారు జాము నుంచి భక్తుల సందడి నెలకొంది. వీరవల్లి, చిరివాడ, పెరికీడు, కానుమోలు గ్రామాల్లోని శివాలయాల్లో భక్తులు క్యూ కట్టారు. పెరికీడు ముక్తేశ్వర స్వామి ఆలయంలో అర్చకులు శ్యామ్ ఏకవార రుద్రాభిషేకం, అర్చనలు, అభిషేకాలు జరిపారు. వీరవల్లి కొండేశ్వరస్వామి ఆలయంలో అర్చకులు మురళీశర్మ ఆధ్వర్యంలో మహాన్యాస పూర్వకరుద్రా భిషేకం, సహస్ర లింగార్చన, బిల్వార్చనలు నిర్వహించారు. చిరివాడ, కానుమోలు ఆలయాల్లో కార్తీక దీపాలు వెలిగించి భోళాశంకరుడిని భక్తి శ్రద్ధలతో పూజించారు.

బడ్జెట్.. భేష్

అన్ని వర్గాలను దృష్టిలో పెట్టుకునే.. ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్



పటమట, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): సోమవారం అసెంబ్లీలో ప్రవేశపట్టిన బడ్జెట్ అన్ని వర్గాల ఆకాంక్షలను దృష్టిలో పెట్టుకుని రూపొందించిన బడ్జెట్ అని, ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్ అన్నారు. సుదీర్ఘ కసరత్తు చేసి పేద, బడుగు బలహీన వర్గాలకు మేలు చేసేలా బడ్జెట్ ఉందని, బుడమేరు శాశ్వత ప్రక్షాళనకు రూ.330కోట్లు ప్రవేశపెట్టడం గొప్ప నిర్ణయమన్నారు. ఐదేళ్లుగా జరిగిన విధ్వంసానికి ఈ బడ్జెట్ చెంపపెట్టులాటిందన్నారు.

రాష్ట్ర సమగ్రాభివృద్ధికి అనుగుణంగా బడ్జెట్: ఎమ్మెల్యే వసంత



జి.కొండూరు, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): సీఎం చంద్రబాబు నేతృత్వంలో మహా కూటమి ప్రభుత్వం జనరంజకంగా బడ్జెట్ ప్రవేశ పెట్టిందని బడ్జెట్ సమావేశాల్లో పాల్గొన్న అనంతరం మైలవరం ఎమ్మెల్యే వసంత వెంకట కృష్ణ ప్రసాద్ అన్నారు. కూటమి ప్రభుత్వం ఎన్నికల ముందు ఇచ్చిన హామీలకు అనుగుణంగా సూపర్‌సిక్స్ పథకాలను అమలుకు కృషి చేస్తుందన్నారు. ఆర్థిక సంక్షోభాన్ని ఎదుర్కొంటూనే ఏపీ సమగ్రాభివృద్ధితో పాటు ప్రజా సంక్షేమమే ప్రధాన లక్ష్యంగా ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందన్నారు. అన్ని వర్గాలకు ఆమోదయోగ్యంగా బడ్జెట్ ఉందన్నారు.

అభివృద్ధి, సంక్షేమం మేళవింపుగా బడ్జెట్: ఎమ్మెల్యే సౌమ్య



నందిగామ, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): అభివృద్ధి, సంక్షేమం మేళవింపుగా కూటమి ప్రభుత్వ బడ్జెట్ ఉందని ఎమ్మెల్యే తంగిరాల సౌమ్య అన్నారు. సోమవారం ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్‌పై స్పందించిన సౌమ్య చరిత్రాత్మక బడ్జెట్‌గా అభివర్ణించారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీల మేర సూపర్ సిక్స్ పథకాలకు నిధులు కేటాయించి కూటమి ప్రభుత్వం నిబద్ధత చాటుకుందన్నారు. మౌళిక వసతుల కల్పన, పారిశ్రామికీకరణ వంటి రంగాలకు పెద్దపీట వేసినట్టు చెప్పారు. వ్యవసాయ రంగం పట్ల పూర్తి చిత్తశుద్ధితో ప్రభుత్వం బడ్జెట్‌లో ప్రత్యేక స్థానం కల్పించిందన్నారు. బడుగు, బలహీన వర్గాల అభ్యున్నతికి గతంలో ఏ ప్రభుత్వం చేయని కేటాయింపులు చేసినట్లు ఆమె తెలిపారు. కూటమి బడ్జెట్ దేశానికి ఆదర్శమన్నారు. ఇంతటి అద్భుత బడ్జెట్‌ను అందించిన ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్, ఆర్థిక మంత్రి పయ్యావుల కేశవ్‌కు ఆమె కృతజ్ఞతలు తెలిపారు.

పేదలను సంపన్నులుగా మార్చే బడ్జెట్: ఎమ్మెల్యే కుమార్‌రాజా



పామర్రు, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): సీఎం చంద్రబాబు సమక్షంలో అసెంబ్లీలో ఆర్థిక మంత్రి పయ్యావుల కేశవ్ ప్రవేశ పెట్టిన బడ్జెట్ పేద వర్గాల ప్రజల్ని సంపన్నుల మార్చేవిధంగా ఉందని పామర్రు ఎమ్మెల్యే వర్ల కుమార్‌రాజా అన్నారు. సోమవారం బడ్జెట్‌పై తన అభిప్రాయాన్ని వివరించారు. ఎన్నికల హామీలో భాగంగా రాష్ట్ర ప్రజలకు ఇచ్చిన హామీల్లో సూపర్ సిక్స్‌కు అధిక ప్రాధాన్యత ఇచ్చారన్నారు. రైతు సంక్షేమం, రాష్ట్ర ప్రగతి, పునఃప్రారంభం, పునర్నిర్మాణానికి ఈ బడ్జెట్ తొలిమెట్టు కాబోతుందన్నారు. అన్ని వర్గాల ప్రజల కలలు సాకారమయ్యేలా ప్రభుత్వం కట్టుబడి ఉందని ఈ బడ్జెట్ రుజువు చేసిందన్నారు.

కూటమి ప్రభుత్వ జనరంజక బడ్జెట్



కొనకళ్ల నారాయణరావు, ఆర్టీసీ చైర్మన్

మచిలీపట్నం టౌన్, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): పేదల సంక్షేమం, రాష్ట్ర సమగ్రాభివృద్ధికి అనుగుణంగా రాష్ట్ర బడ్జెట్ ఉంది. కూటమి ప్రభుత్వం జనరంజకంగా బడ్జెట్‌ను ప్రవేశపెట్టింది. ఎన్నికల ముందు ఇచ్చిన హామీలకు అనుగుణంగా సూపర్‌సిక్స్ పథకాల అమలుకు ఈ బడ్జెట్ దోహదపడుతుంది. ఒక పక్క ఆర్థిక సంక్షోభం ఎదుర్కొంటూనే రాష్ట్ర సమగ్రాభివృద్ధితో పాటు పేదల సంక్షేమ, అభివృద్ధికి నిధులు కేటాయించారు. ఉన్నత విద్యకు రూ.2326, పట్టణాభివృద్ధికి రూ.11490, గృహ నిర్మాణాలకు రూ.4012, జలవనరుల శాఖకు రూ.16705, పరిశ్రమలు, వాణిజ్య రంగానికి రూ.3125 కోట్లు కేటాయించడం ముదావహం.

క్రీడల పట్ల బడ్జెట్‌లో చిత్తశుద్ధి చాటారు



అనిమిని రవినాయుడు, శాప్ చైర్మన్

విజయవాడ స్పోర్ట్సు, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): క్రీడారంగంపై సీఎం చంద్రబాబు నాయుడుకున్న చిత్తశుద్ధి బడ్జెట్‌లో వెల్లడైంది. అసెంబ్లీ సమావేశంలో క్రీడా రంగానికి ప్రాధాన్యత కల్పిస్తూ బడ్జెట్‌లో ప్రవేశపెట్టడమే నిదర్శనని శాప్ చైర్మన్ అనిమిని రవినాయుడు హర్షం వ్యక్తం చేశారు. ఉద్యోగ కల్పనలో స్పోర్ట్సు కోటా రిజర్వేషన్ శాతం 2 నుంచి 3 శాతానికి పెంచడం, క్రీడారంగాన్ని ప్రోత్సహిస్తూ రూ.100 కోట్ల ప్రకటించడం ఆనందదాయకం. సీఎం చంద్రబాబు, కూటమి ప్రభుత్వానికి శాప్ నుంచి ప్రత్యేక కృతజ్ఞతలు.

తల్లికి వందనానికి రూ.2491 కోట్ల కేటాయిపు ముదావహం

మహమ్మద్ సద్‌రుద్దీన్ ఖురేషి, ముస్లిం సంక్షేమ సంఘం రాష్ట్ర అధికార ప్రతినిధి



మచిలీపట్నం టౌన్, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): తల్లికి వందనం కింద పేద విద్యార్థులను ఆదుకునేందుకు రాష్ట్ర ప్రభుత్వం రూ.2491 కోట్లు కేటాయించడం ముదావహం. సూపర్‌సిక్స్‌లో ఇచ్చిన హామీలు ఒక్కొక్కటి నెరవేరుస్తున్నారు. అయితే ముస్లిం మైనారిటీలకు గత ప్రభుత్వం ఇచ్చినదానికంటే తక్కువగా రూ.4376 కోట్లు కేటాయించడం దురదృష్టకరం.

రైతులకు బడ్జెట్‌లో సరిపడా నిధులు అభినందనీయం

గోపు సత్యనారాయణ, కృష్ణాజిల్లా తెలుగురైతు అధ్యక్షుడు



రైతుల సంక్షేమానికి బడ్జెట్‌లో ఆశించిన విధంగా ప్రభుత్వం కేటాయించడం అభినందనీయం. బడ్జెట్‌లో తగిన నిధులు కేటాయించి కూటమి ప్రభుత్వం రైతు ప్రభుత్వమని మరోసారి నిరూపించుకుంది. రైతుల కోసం విత్తనాల రాయితీకి రూ.240, భూసార పరీక్షలకు రూ.39, విత్తనాల పంపిణీకి రూ.240, ఎరువుల సరఫరాకు రూ.40, పొలం పిలుస్తోందికి రూ.1131, ప్రకృతి వ్యవసాయానికి రూ.423 కోట్లు కేటాయించారు.




లైట్ మెట్రోకు ముందడుగు

లైట్ మెట్రో రైల్ ప్రాజెక్టుకు అడుగులు పడేందుకు వీలుగా రాష్ట్ర ప్రభుత్వం బడ్జెట్‌లో నిధులు కేటాయించింది. గత ప్రభుత్వ హయాంలో తొక్కి పట్టిన లైట్ మెట్రో రైల్ ప్రాజెక్టుకు రాష్ట్ర ప్రభుత్వం రూ.50 కోట్ల నిధులు కేటాయించింది. బడ్జెట్ అంటూ కేటాయించటంతో మెట్రో ప్రాజెక్టుకు కదలిక వచ్చినట్టు భావించాల్సి ఉంది. బడ్జెట్‌లో కేటాయింపుల వల్ల ఈ ప్రాజెక్టు పట్టాలెక్కే దశలోనే ఉందన్నది అర్థమౌతోంది. కిందటి వైసీపీ ప్రభుత్వ హయాంలో లైట్ మెట్రోకు ఐదేళ్లూ ఒక్క పైసా కేటాయించలేదు. దీంతో లైట్ మెట్రో రైల్ ప్రాజెక్టు మరుగున పడిపోయింది.

- ఆంధ్రజ్యోతి, విజయవాడ

గత టీడీపీ ప్రభుత్వ హయాంలో లైట్ మెట్రో రైల్ ప్రాజెక్టుకు శ్రీకారం చుట్టారన్న ఉద్దేశంతో తమ ప్రభుత్వంలో చేతికి వచ్చిన తుది డీపీఆర్‌ను ఆమోదించకుండా రాష్ట్ర ప్రభుత్వం తొక్కి పట్టింది. రాష్ట్ర క్యాబినెట్‌లో ఆమోదించాల్సిన లైట్ మెట్రో రైల్ ప్రాజెక్టును ఆమోదించలేదు. క్యాబినెట్ ఆమోదం ద్వారా కేంద్ర ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపే అవకాశం ఉంటుంది. కేంద్ర ప్రభుత్వానికి కూడా ఐదేళ్లూ పంపించలేదు. దీంతో అమరావతి తరహాలోనే విజయవాడకు కూడా వైసీపీ ప్రభుత్వం మొండిచెయి చూపింది. టీడీపీ ప్రభుత్వం అధికారంలోకి రాగానే లైట్ మెట్రో రైల్ ప్రాజెక్టు కోసం చర్యలు చేపట్టింది. గతంలో మెట్రో రైల్ కార్పొరేషన్ ఎండీగా ఉన్న రామకృష్ణారెడ్డికి మళ్లీ దీని బాధ్యతలను అప్పగించింది. ఆయన వచ్చీ రాగానే ఎక్కడికక్కడ ఆగిపోయిన ప్రక్రియలన్నింటినీ తిరిగి ప్రారంభించారు. తుది డీపీఆర్‌ను ప్రస్తుత రాష్ట్ర ప్రభుత్వానికి అందజేశారు. దీనిపై రాష్ట్ర ప్రభుత్వ స్థాయిలో అత్యున్నత నిర్ణయం తీసుకోవాల్సి ఉంది. ఈ దశలో లైట్ మెట్రోకు రాష్ట్ర ప్రభుత్వం బడ్జెట్ కేటాయింపులు జరపటంతో విజయవాడకు అత్యంత ప్రతిష్ఠాత్మక అడుగులు పడినట్టు అయింది. విజయవాడ లైట్ మెట్రో రైల్ ప్రాజెక్టుకు సంబంధించి తొలి దశలో మొదటి కారిడార్ గన్నవరం నుంచి ఎయిర్‌పోర్టుకు అనుసంధానం చేసి ఎన్‌హెచ్ - 16 మీదుగా రామవరప్పాడు రింగ్ నుంచి ఏలూరు రోడ్డు మీదుగా రైల్వేస్టేషన్, తిరిగి పీఎన్‌బీఎస్‌కు చేరుకుంటుంది. 2వ కారిడార్ పెనమలూరు సెంటర్ నుంచి పీఎన్‌బీఎస్ వరకు ఉంటుంది. రెండో దశలో పీఎన్‌బీఎస్ నుంచి అమరావతికి పొడిగిస్తారు. లైట్ మెట్రో రైల్ ప్రాజెక్టుకు సంబంధించి నిధులు సర్దుబాటు అనేది కేంద్ర ప్రభుత్వం 20 శాతం, రాష్ట్ర ప్రభుత్వం 20 శాతం చొప్పున భరించగలిగితే మిగిలిన 60 శాతం అప్పుతీసుకోవచ్చు. ఈ ప్రాజెక్టుకు నూరు శాతం కేంద్ర ప్రభుత్వం సహాయం చేయటానికి అవకాశం ఉంది. లేకుంటే పీపీపీ పద్ధతిలో అయినా ప్రాజెక్టును అభివృద్ధి చేయటానికి అవకాశాలున్నాయి.



రెండు దశల్లో నిర్మించనున్న లైట్ మెట్రో రూట్ మ్యాప్

ఆశాలకు ఒంటరి మహిళ, వితంతు

పెన్షన్లు పునరుద్ధరించండి

కృష్ణలంక, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): ఆశా వర్కర్లకు నిలిపేసిన వితంతు, ఒంటరి మహిళా పెన్షన్లు పునరుద్ధరించాలని కోరుతూ సోమవారం కలెక్టరేట్‌లో జరిగిన స్పందనలో ఆశా వర్కర్స్ యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎ.కమల, ఉపాధ్యక్షురాలు టి.హవేలీకుమారి.. డీఆర్వో లక్ష్మీ నరసింహను కలిసి వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా కమల మాట్లాడుతూ గ్రామీణ పట్టణ ప్రాంతాల్లోని పేద ప్రజలకు, గర్భిణీ/బాలింతలకు, పసిపిల్లలకు, నిరంతరం ఆరోగ్య పరమైన సేవలందించడంలో ఆశా వర్కర్లు కీలక పాత్ర పోషిస్తున్నారన్నారు. ఆశా వర్కర్లందరూ దళిత బలహీన వర్గాల కు చెందిన పేద మహిళలని ప్రభుత్వం వీరికి చెల్లించేది, కనీస వేతనం కాదని, గౌరవ వేతనం మాత్రమేనని ఆరోపించారు. పైగా వీరికి పీఎఫ్, ఈఎస్ఐ, గ్రాట్యుటీ, పెన్షన్, వంటి సౌకర్యాలేవీ వర్తించడం లేదని, చివరికి చనిపోతే మట్టిఖర్చులు కూడా లేని దయనీయ పరిస్థితిలో జీవనం కొనసాగిస్తున్నారన్నారు. పెరుగుతున్న ధరలతో వచ్చే గౌరవ వేతనం చాలక, ఆర్థికంగా అనేక ఇబ్బందులు పడుతున్నారన్నారు. కానీ ఇప్పటివరకు ఇస్తున్న ఒంటరి మహిళ వితంతు పెన్షన్లను, ప్రభుత్వ ఉద్యోగులనే పేరుతో ఆశ వర్కర్లకు ఆపివేయడం దుర్మార్గమన్నారు. ఆశా వర్కర్లు ఎదుర్కొనే సమస్యల పరిష్కారానికి ఈనెల 18న విజయవాడ సెంటర్ వద్ద జరిగే ధర్నాలో ఆశా వర్కర్లు పెద్దసంఖ్యలో పాల్గొనాలని పిలుపునిచ్చారు.

జిల్లా ఆశా వర్కర్స్ యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి కమల



డీఆర్వోకు వినతిపత్రం ఇస్తున్న కమల

విలీన అధ్యాపకులకు తీవ్ర అన్యాయం

• డాక్టర్ కొల్లేటి రమేష్

కృష్ణలంక, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా నిర్వహిస్తున్న ఉత్తమ ఉపాధ్యాయుల ఎన్నికల్లో ఈ ఏడాది కూడా ఎయిడెడ్ నుంచి ప్రభుత్వంలోని విలీనమైన డిగ్రీ కళాశాలల అధ్యాపకులకు అన్యాయం జరిగిందని విలీన కళాశాల అధ్యాపకుల సంఘం రాష్ట్ర జనరల్ సెక్రటరీ డాక్టర్ కొల్లేటి రమేష్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. వాస్తవానికి డిగ్రీ కళాశాలల్లో విద్యార్థుల బోధన, కళాశాలల న్యాక్ గుర్తింపులో కళాశాలల అభివృద్ధి కార్యక్రమాల్లో ఎంతో అనుభవం ఉన్న అధ్యాపకులైన విలీన సిబ్బంది ద్వారా ప్రయోజనాలన్నీ పొంది ఉత్తమ అధ్యాపకుల అవార్డులకు విలీన అధ్యాపకులను పరిగణించకపోవడం పట్ల అధికారులకు మాపై ఉన్న వివక్ష తేటతెల్లమైందని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ అవార్డుల ఎంపిక ప్రక్రియపై సమగ్ర విచారణ జరిపించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

గీతాభిషేకం పుస్తకావిష్కరణ



గీతాభిషేకం పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న ఈవో రామారావు తదితరులు



దీపాలను వెలిగిస్తున్న ఈవో రామారావు

వన్‌టౌన్, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): ఉజ్జయిని శ్రీమహాకాళేశ్వరుడి అలంకారాలను వర్ణిస్తూ ప్రతిరోజూ శివుడిపై ఒక పాట చొప్పున పచ్చిపులు సు సూర్యనారాయణ 1575 రోజులుగా రాస్తున్నారు. వీటిలో 108 పాటలను కార్తీక మాసం సందర్భంగా ఆవిష్కరించి భక్తులకు ఉచితంగా పంచేందుకు నిర్ణయించారు. ఇందుకు దుర్గగుడి ఈవో రామారావు సహకరించారు, పుస్తకాన్ని కళావేదికపై సోమవారం ఆవిష్కరించారు. శ్రీదేవి సాంస్కృతిక సాంఘిక సంక్షేమ సంఘం వ్యవస్థాపకురాలు దూపాటి శ్రీదేవి కార్యక్రమాన్ని నిర్వహించారు. రచయితను ఈవో రామారావు సత్కరించారు. అమ్మవారి ప్రసాదం అందజేశారు. కాగా సహస్రలింగార్చన, సహస్రదీపాలంకరణ, ఊంజల్ సేవలో ఈవో రామారావు దంపతులు పాల్గొన్నారు. కళావేదికపై విజయవాడ కొత్తపేటకు చెందిన కూచిపూడి నృత్యాలయ బృందం కూచిపూడి నాట్యం చేసి ఆహూతులను అలరించారు.



దుర్గమ్మ సన్నిధిలో అఘోరీ

తెలంగాణలో వివాదాస్పదంగా మారిన అఘోరీ నాగసాధు ఇటీవల రాష్ట్రంలోని అనేక శైవాలయాలను దర్శించుకుంటున్న సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలో ఇంద్రకీలాద్రిపైనున్న కనకదుర్గమ్మను దర్శించుకునేందుకు సోమవారం దుర్గగుడికి వచ్చి ఆలయం చుట్టూ ప్రదక్షిణలు చేసింది. ఆమె వచ్చి వెళ్లే వరకు సిబ్బంది వెంటే ఉన్నారు.

బడ్జెట్‌పై వామపక్షాల పెదవి విరుపులు

గవర్నర్‌పేట, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ఆర్థిక మంత్రి సోమవారం అసెంబ్లీలో ప్రవేశపెట్టిన బడ్జెట్‌పై వామపక్షాలు, వామపక్ష అనుబంధ ఎమ్మెల్సీలు, ఉపాధ్యాయ సంఘాలు పెదవి విరిచాయి. పీడీఎఫ్ ఎమ్మెల్సీలు కేఎస్ లక్ష్మణరావు, ఐ. వెంకటేశ్వరరావు బడ్జెట్‌పై మాట్లాడుతూ రూ.2.94 లక్షల కోట్లతో ప్రతిపాదించిన రాష్ట్ర బడ్జెట్‌లో మౌలిక రంగాలకు తగిన కేటాయింపులు జరగలేదన్నారు. ఇరిగేషన్ రంగానికి రూ.16,705 కోట్లు కేటాయించడం, ప్రాజెక్టుల నిర్మాణాలకు సరిపోవని, రాజధాని అంతర్జాతీయ సంస్థలు ఇస్తామన్న రూ. 15వేల కోట్లు గ్రాంట్‌గానా, లేక రుణమా తేల్చలేదన్నారు. ఉద్యోగులు, ఉపాధ్యాయులు, పెన్షనర్లకు చెల్లించాల్సిన రూ.22 వేల కోట్లు బకాయిల ప్రస్తావన లేదని, 12వ పీ ఆర్‌సీ గురించి పేర్కొనలేదన్నారు.

విద్యారంగానికి తగ్గిన కేటాయింపులు: యూటీఎఫ్

బడ్జెట్‌లో విద్యారంగానికి నిధులు 9.8 శాతం మాత్రమే ప్రభుత్వం కేటాయించిందని, గత బడ్జెట్‌తో పోల్చితే చాలా తక్కువన్నారు. ఈ నిధులు ప్రభుత్వ విద్యారంగాభివృద్ధికి ఉపయోగపడవని యూటీఎఫ్ రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఎన్ వెంకటేశ్వర్లు, కేఎస్ఎస్ ప్రసాద్ సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ప్రభుత్వ పాఠశాలల పట్ల తల్లిదండ్రులకు ఆసక్తిని పెంచేలా చర్యలు తీసుకోవాలని, బడ్జెట్‌లో నిధులు పెంచాలన్నారు. ఆర్థిక బకాయిల చెల్లింపులు, 12వ పీఆర్‌సీ అమలుకు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

పరనిందతో నిండిపోయింది: సీపీఎం

ఆర్థికమంత్రి బడ్జెట్ ప్రసంగం ఆత్మస్తుతి, పరనిందతో నిండిపోయిందని, రాష్ట్ర ప్రజలకు నిర్దిష్టంగా కలిగే ప్రయోజనాలు గురించి ప్రస్తావనే లేదని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వి. శ్రీనివాసరావు అన్నారు. కూటమి ప్రభుత్వం ఎన్నికల హామీలను ఎప్పటి నుంచి అమలు చేస్తోందో కనీస ప్రస్తావన చేయకపోవడం ప్రజల్ని మోసం చేయడమేనన్నారు. అధికారంలోకి వస్తే విద్యుత్ చార్జీలు తగ్గిస్తామని చెప్పిన కూటమి బడ్జెట్‌లో చార్జీల తగ్గింపు గురించి ప్రస్తావనే చేయకపోవడం విడ్డూరంగా ఉందన్నారు. ఆదివాసీలు, దళితులకు, మహిళలకు, మైనారిటీ సంక్షేమానికి నామమాత్రంగా నిధులు కేటాయించడం అన్యాయమన్నారు. బడ్జెట్ ప్రజల సంక్షేమాన్ని, రాష్ట్రాభివృద్ధిని విస్మరించిందన్నారు.




బాలుర అండర్-19 వాలీబాల్ టోర్నీ విజేత టీమ్‌కు ట్రోఫీ అందిస్తున్న సీఎస్ఎస్ఎన్ రెడ్డి

స్టేట్ వాలీబాల్ చాంప్‌గా శ్రీకాకుళం, విశాఖ

విజయవాడ స్పోర్ట్సు, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): పీబీ సిద్ధార్థ జూనియర్ కళాశాల ఆవరణలో 3 రోజుల నుంచి జరుగుతున్న 68 ఏపీ స్టేట్ (అంతర్ జిల్లాల) వాలీబాల్ అండర్-19 బాల బాలికల చాంపియన్‌షిప్ బాలుర విభాగంలో శ్రీకాకుళం, బాలికల విభాగంలో విశాఖపట్నం జిల్లా టీమ్‌లు టైటిళ్లను వశం చేసుకున్నాయి. బాలుర విభాగంలో తూర్పుగోదావరి (ద్వితీయ), విశాఖపట్నం (తృతీయ), బాలికల్లో పశ్చిమగోదావరి (ద్వితీయ), విజయనగరం (తృతీయ)స్థానాల్లో నిలిచాయి. జిల్లా స్కూల్ గేమ్స్ అండర్-19 సెక్రటరీ వీ రవికాంత ఆధ్వర్యంలో జరిగిన విజేతలకు ట్రోఫీల ప్రదానోత్సవంలో ఎన్టీఆర్ జిల్లా ఇంటర్మీడియట్ ఎడ్యుకేషన్ ఆఫీసర్ సీఎస్ఎస్ఎన్ రెడ్డి, జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ చుండీ వెంకటేశ్వర్లు, పరిశీలకులు నాగేశ్వరరావు, కృష్ణాజిల్లా వాలీబాల్ అసోసియేషన్ సెక్రటరీ దోనేపూడి దయాకర్, సెలక్షన్ కమిటీ సభ్యులు కేవీ నారాయణ, కె. భుజంగరావు, కె సుజాత, కె. మార్కండేయులు,ఎన్ సునీత పాల్గొని అందజేశారు.

ప్రపంచ వర్శిటీ షూటింగ్‌లో భారత్‌కు స్వర్ణం



విజయవాడ స్పోర్ట్సు, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): న్యూఢిల్లీలో సోమవారం జరిగిన ప్రపంచ వర్శిటీ రైఫిల్ షూటింగ్‌లో భారత్ టీమ్ స్వర్ణంతో మెరిసింది. 10 మీటర్ల ఎయిర్ రైఫిల్ షూటింగ్‌లో విజయవాడ నగరానికి చెందిన మద్దినేని ఉమామహేష్, ఐశ్వర్య ప్రతాప్, రమేష్‌తో కూడిన టీమ్ స్వర్ణం వశం చేసుకుంది. వ్యక్తిగత 10 మీటర్ల ఎయిర్ రైఫిల్ షూటింగ్‌లో 0.1 పాయింట్ తేడాతో ఉమామహేష్ కాంస్యం కోల్పోయాడు. మొత్తం ప్రపంచలోని 23 దేశాల ఈ టోర్నీలో బరిలో దిగాయి. ఉమామహేష్ కేఎల్ వర్శిటీలో సీఎస్‌బిటీ చివరి ఏడాది చదువుతున్నాడు. స్వర్ణం సాధించిన ఉమామహేష్‌కు చైర్మన్, వీసీ అభినందనలు తెలిపారు.

శాప్ చైర్మన్‌తో ఎమ్మెల్సీల చర్చ

విజయవాడ స్పోర్ట్సు, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): నగరంలోని శాప్ కార్యాలయంలో శాప్ చైర్మన్ అనిమిని రవినాయుడును ఉత్తరాంధ్ర గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ చిరంజీవిరావు, తూర్పు రాయలసీమ ఎమ్మెల్సీ కంచర్ల శ్రీకాంత్, పశ్చిమ రాయలసీమ ఎమ్మెల్సీ రాంగోపాల్‌రెడ్డి సోమవారం మర్యాద పూర్వకంగా కలిసి క్రీడారంగ అభివృద్ధిపై చర్చించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీలను రవినాయుడు దుశ్శాలువాలతో సత్కరించారు. క్రీడాభివృద్ధికి అందరం కలిసి పనిచేద్దామని పిలుపునిచ్చారు.

పతకాలతో ఏపీకి ఉన్నతస్థానం

ఏపీ స్పోర్ట్సు అథారిటీ క్రీడాకారులకు అండగా ఉంటుందని శాప్ చైర్మన్ రవినాయుడు భరోసా ఇచ్చారు. జగ్గయ్యపేట పవర్‌లిఫ్టింగ్‌లో స్వర్ణం సాధించిన రాజమండ్రికి చెందిన పవర్‌లిఫ్టర్ వి. రేవతి చైర్మన్‌ను కలిసి మెడల్‌ను చూపించారు. ఒంగోలుకు చెందిన అథ్లెట్ రామతులసీ ఇటీవల మలేషియా ఓపెన్ సాధించిన కాంస్యం చూపించారు. భవిష్యత్తులో మరిన్ని పతకాలను సాధించాలని రవినాయుడు ఆకాంక్షించారు.

రాష్ట్ర స్కేటింగ్‌లో అక్కాతమ్ముళ్ల సత్తా



విజయవాడ స్పోర్ట్సు, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): మంగళగిరిలోని మున్సిపల్ స్కేటింగ్ పార్కులో సోమవారం జరిగిన రాష్ట్రస్థాయి 36వ స్కేటింగ్ చాంపియన్‌షిప్‌లో నగరానికి చెందిన అక్కాతమ్ముళ్లు మాత్రపు జెస్సీ రాజ్, జోయల్ ఆదర్శ్ పతకాలతో సత్తా చాటారు. రాష్ట్రవ్యాప్తంగా 250 స్కేటింగ్ క్రీడాకారులు బరిలో నిలవగా, జెస్సీ రాజ్ ఇన్‌లైన్‌లో రజతం సోలో డ్యాన్స్‌లో రజతం, ఫిగర్ విభాగంలో కాంస్యం సాధించింది. జోయల్ ఆదర్శ్ ఇన్‌లైన్‌లో కాంస్యం, ఫిగర్‌లో కాంస్యంలను సాధించింది. పతకాలు సాధించిన అక్కాతమ్ముళ్లను ఏపీ స్కేటింగ్ సంఘం కార్యదర్శి థామస్ చౌదరీ, చైర్మన్ పవన్‌కుమార్, సీనియర్ కోచ్ సింహాద్రి అభినందించారు. జెస్సీ రాజ్ ఇటీవలే న్యూజిలాండ్‌లో జరిగిన ప్రపంచస్థాయి ఓషియానిక్ ఆర్టిస్టిక్ స్కేటింగ్‌లో స్వర్ణం సాధించడం గమనార్హం.

రైల్వేస్ చేతిలో ఆంధ్ర క్రికెట్ జట్టు పరాజయం

మూలపాడు వేదికగా కల్నల్ సీకే నాయుడు క్రికెట్ ట్రోఫీలో ఆంధ్ర క్రికెట్ టీమ్‌కు తొలి పరాజయం చవిచూసింది. రైల్వేస్ జట్టుతో మల్టీడేస్ క్రికెట్‌లో 325 పరుగుల లక్ష్యంతో బరిలో దిగిన ఆంధ్ర టీమ్ పోరాడి 227 పరుగులకు కుప్పకూలింది. తొలి ఇన్నింగ్స్‌లో 446, రెండో ఇన్నింగ్స్‌లో 182 పరుగులను రైల్వేస్ టీమ్ చేయగా ఆంధ్ర జట్టు తొలి ఇన్నింగ్స్‌లో 303 పరుగులకు కుప్పకూలిన విషయం తెల్సిందే. బౌలింగ్‌లో పటిష్టంగానే ఉన్నా ఆంధ్ర బ్యాటర్లు తేలిపోవడంతో 98 పరుగుల తేడాతో పరాజయం చెందింది. ఇంతకుముందు మేఘాలయ, విదర్భ జట్లపై ఆంధ్ర జయభేరి మోగించింది.

విజయవాడలో

వైసీపీకి బిగ్‌షాక్!

- వైఎస్ఆర్‌సీపీ నుంచి జనసేనలోకి వలసలు
- పవన్‌కల్యాణ్ సమక్షంలో నలుగురు కార్పొరేటర్లు జనసేనలో చేరిక

వన్‌టౌన్, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): అసెంబ్లీ ఎన్నికల్లో రాష్ట్రవ్యాప్తంగా 11 ఎమ్మెల్యే సీట్లను మాత్రమే గెలుచుకున్న వైఎస్ఆర్‌సీపీలో నేతలు, శ్రేణులు ఆ పార్టీని ఒక్కొక్కరుగా వీడుతున్నారు. ఇంతకుముందు కొంతమంది అటు టీడీపీలో, ఇటు జనసేనలో చేరుతున్న పరిస్థితి ఉంది. తాజాగా విజయవాడ పశ్చిమ నియోజకవర్గంలోని 53వ డివిజన్ కార్పొరేటర్ మహదేవు అప్పాజీరావు, 51 వడివిజన్ కార్పొరేటర్ మరుపిళ్ల రాజేష్, 48వ డివిజన్ కార్పొరేటర్ అత్తలూరి ఆదిలక్ష్మి, తూర్పు నియోజకవర్గంలోని 16వ డివిజన్ కార్పొరేటర్ ఉమ్మడిశెట్టి రాధిక ఎన్టీఆర్ జిల్లా జనసేన అధ్యక్షుడు సామినేని ఉదయభాను ఆధ్వర్యంలో సోమవారం మంగళగిరిలోని జనసేన రాష్ట్ర కార్యాలయంలో డిప్యూటీ ముఖ్యమంత్రి, జనసేన అధ్యక్షుడు పవన్ కల్యాణ్ సమక్షంలో పార్టీ కండువాలు కప్పుకున్నారు. వీరందరినీ పవన్‌కల్యాణ్ సాదరంగా ఆహ్వానించారు. ఈ సందర్భంగా పవన్ కల్యాణ్ మాట్లాడుతూ, దాదాపు శూన్య స్థితిలో తాను పార్టీ పెట్టినట్లు తెలిపారు. ప్రజల కోసమే పని చేయడానికి తాను అడుగులు ముందుకు వేసినట్లు చెప్పారు. 2009 నుంచి ఎమ్మెల్సీగా ఎన్నికయిన హరిప్రసాద్ తనతోనే నడిచినట్లు తెలిపారు. నాదెండ్ల మనోహర్ రాష్ట్రానికి మేలు చేయాలన్న సంకల్పంతో వచ్చారన్నారు. తామంతా విపత్కర పరిస్థితులలో కలసి పనిచేసినట్లు తెలిపారు. కష్టాల కొలిమిలో నడుస్తూనే రాష్ట్రానికి అండగా ఉండాలని సంకల్పించినట్లు చెప్పారు.బీడు భూమి తప్ప ఇంక ఏమీ లేని స్థలంలో మంగళగిరిలో పార్టీ కార్యాలయాన్ని ప్రారంభించామన్నారు. 2016లో మీడియా కూడా త్వరగా వచ్చేవారు కాదన్నారు. పదేళ్లు పార్టీ నిర్మాణానికి సమయం పట్టిందన్నారు. జనసేనకు బలమైన స్థానిక నాయకత్వం ఇప్పుడు ఉందన్నారు. కార్పొరేటర్లు పార్టీలోకి రావడం శుభపరిణామమన్నారు. మోదీ మద్దతుతో చంద్రబాబు నాయకత్వంలో అందరం కలిసి పనిచేద్దామని పిలుపునిచ్చారు. రూ.లక్షా 31వేల కోట్ల రుణంతో కలెక్టివ్ బడ్జెట్‌ను ప్రవేశపెట్టామన్నారు. టీడీపీ, చంద్రబాబు సుదీర్ఘ అనుభవానికి జనసేన బలమైన పోరాట శక్తిని ఇచ్చిందన్నారు. బీజేపీకి దేశంలో ఉన్న శక్తి సామర్థ్యాలు రాష్ట్ర అభివృద్ధికి బలంగా మారాయన్నారు. ఎంత పనిచేస్తే అంత గుర్తింపు పార్టీలో ఉంటుందన్నారు. హరిప్రసాద్, ఉదయభాను, మధుసూదన్‌రెడ్డి, రియాజ్, మండలి రాజేష్‌కు పవన్ కల్యాణ్ అభినందనలు తెలిపారు. ఉదయభాను పార్టీలోకి వచ్చిన తరువాత పార్టీని బలోపేతం చేయాలని సూచించానని, ఆయన అసెంబ్లీలో అడుగుపెట్టాల్సి ఉన్నా తృటిలో తప్పిందని, ఈసారి ఉదయభాను నిర్ణయాత్మక పాత్రలో ఉంటారని పవన్ కల్యాణ్ స్పష్టం చేశారు.

ఎయిర్‌పోర్టు అభివృద్ధి, నిర్వాసితులకు కేటాయింపులు

- నిర్వాసితుల ఆర్అండ్ఆర్ కోసం రూ. 24.56 కోట్లు

ఆంధ్రజ్యోతి, విజయవాడ: విజయవాడ అంతర్జాతీయ విమానాశ్రయాభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం కంకణం కట్టుకుంది. విమానాశ్రయాభివృద్ధికి సంబంధించి రూ.5 కోట్లను కేటాయించగా.. విమానాశ్రయ నిర్వాసితులకు ఊరటనిచ్చేలా రూ. 24.56 కోట్లను తొలి దశలో ఆర్అండ్ఆర్ ప్యాకేజీ కింద డబ్బులు కేటాయించింది. విమానాశ్రయ నిర్వాసితులకు తొలి దశలో ఇళ్ళు నిర్మించుకోవటానికి రూ. 4.50 లక్షల నిధులను ఇస్తామని ప్రభుత్వం హామీ ఇచ్చింది. దీనికి సంబంధించి జీఓ కూడా ఇటీవల జారీ చేసింది. ఈ నేపథ్యంలో, ప్రభుత్వం తాను అన్నట్టుగానే రూ. 24.56 కోట్లను విడుదల చేసింది. ఈ నిధులతో చిన్న అవుటపల్లిలోని ఆర్అండ్ఆర్ లే అవుట్‌లో తమకు కేటాయించిన ప్లాట్లలో ఇళ్ళ పనులు ప్రారంభించుకోవటానికి అవకాశం ఏర్పడుతుంది.

బ్రాయిలర్ ధరలు

అమరావతి (రూ.లలో)

బ్రాయిలర్ బర్డ్	124,133, 144
చికెన్ విత్ స్కిన్	234
చికెన్ స్కిన్‌లెస్	244

నెక్ కోడిగుడ్డు ధర (100)

విజయవాడ జోన్ రైతు ధర రూ.565

కుమ్మమూరులో రీ సర్వే గ్రామసభ

తోట్లవల్లూరు, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): కుమ్మమూరు పంచాయతీ కార్యాలయం వద్ద సర్పంచ్ బొమ్మారెడ్డి వెంకటేశ్వరరెడ్డి అధ్యక్షతన సోమవారం భూ సమస్యలపై రీ సర్వే గ్రామసభ నిర్వహించారు. తహసీల్దార్ ఎం.కుసుమకుమారి రైతుల నుంచి అర్జీలను స్వీకరించారు. భూ సమస్యలపై నాలుగు అర్జీలు వచ్చాయి. రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.



అర్జీలు స్వీకరిస్తున్న తహసీల్దార్ కుసుమకుమారి

వృద్ధులకు దుస్తుల పంపిణీ

గుడివాడ, నవంబరు 11(ఆంధ్రజ్యోతి): బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు వలపర్ల వెంకటేశ్వరరావు, విజయస్వరూపల కుమార్తె రోహిత పుట్టినరోజు సందర్భంగా బేతవోలు, జగన్నాథపురంలోని శాంతి వృద్ధాశ్రమం, కరుణాపీఠంలో వృద్ధులకు నూతన వస్త్రాలను పంచి, భోజనాలు పెట్టారు. శ్రీకృష్ణ యాదవ సేవాసంఘం రాష్ట్ర అధ్యక్షుడు పుట్టి హరికుమార్, సయ్యద్ గఫార్, తిరుపతయ్య, నిర్మల లారెన్స్, గంటా ప్రభాకర్, తలకాల వినోద్, వలపర్ల శుక్రుద్, హరిబాబు, మునీంద్ర, తాతారావు పాల్గొన్నారు.

చెత్త సేకరణలో అలసత్వం వహిస్తే చర్యలు

● మున్సిపల్ కమిషనర్ శ్రీనివాసరావు

గుడివాడ, నవంబరు 11(ఆంధ్రజ్యోతి): మున్సిపల్ సిబ్బంది చెత్త సేకరణలో అలసత్వం వహిస్తే చర్యలు తప్పవని మున్సిపల్ కమిషనర్ బి.శ్రీనివాసరావు హెచ్చరించారు. సోమవారం పట్టణంలోని పలు ప్రాంతాల్లో పారిశుధ్య పనులను అసిస్టెంట్ కమిషనర్ పి.శ్రీనివాసరావుతో కలిసి ఆయన పరిశీలించారు. డ్రెయిన్లలో పేరుకుపోయిన, తొలగించిన మట్టి, చెత్తను వెంటనే ట్రాక్టర్ల ద్వారా డంపింగ్ యార్డుకు తరలించాలని ఆదేశించారు.



మచిలీపట్నం అర్బన్ డెవలప్‌మెంట్ చైర్మన్ మట్టా ప్రసాద్‌ను సత్కరిస్తున్న నేతలు

మట్టా ప్రసాద్‌కు సత్కారం

పెదపారుపూడి, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): మచిలీపట్నం అర్బన్ డెవలప్‌మెంట్ చైర్మన్‌గా నియమితుడైన మట్టా ప్రసాద్‌ను పలువురు నేతలు మర్యాదపూర్వకంగా కలుసుకున్నారు. పామర్రు నియోజకవర్గ గౌడ సంఘ నాయకుడు కాగిత లక్ష్మీనారాయణ, జనసేన పార్టీ మండల అధ్యక్షుడు పోలిశెట్టి నాగసురేష్, దేవర శ్రీనివాసరావు, మెండెం బాబూరావు, పరసా గోపాలకృష్ణ, గోళ్ల నారాయణరావు, వంక శివకుమార్‌లు మట్టా ప్రసాద్ ఇంటికి వెళ్లి అభినందించి, శాలువాలతో సత్కరించారు.



గోడను తొలగిస్తున్న అధికారులు

రహదారి ఆక్రమించి ప్రహరీ

● గోడ తొలగించిన అధికారులు

పెదపారుపూడి, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): పాములపాడు గ్రామ శివారు దూళ్లవానిగూడెం గ్రామంలో పల్లి కోటయ్య, విజయమ్మ రహదారి తమదేనని, దానిని ఆక్రమించి గోడను నిర్మించి గేటు పెడుతున్నారని గ్రామస్థులు దగాని సందీప్, ప్రేమ్ ఇచ్చిన ఫిర్యాదుపై తహసీల్దార్ వై.రంగారావు, ఎంపీడీవో టి.సీతామహాలక్ష్మి సోమవారం గ్రామానికి వెళ్లారు. ఎస్సై, సిబ్బంది సాయంతో ప్రహరీ, గేటును తొలగించారు.

నేత్రదానం

గుడివాడ, నవంబరు 11(ఆంధ్రజ్యోతి): ది గుడివాడ అర్బన్ బ్యాంకు సీఈవో తుమ్మల సాయిబాబు తండ్రి శ్రీనివాసరావు మృతి చెందగా, ఆయన కుటుంబసభ్యుల అనుమతితో ఎల్వీ ప్రసాద్ కంటి ఆస్పత్రి వైద్యులు నేత్రాలను సేకరించారు. మానవత స్వచ్ఛంద సంస్థ చైర్మన్ పిన్నమనేని వేణు గోపాలరావు, అధ్యక్షుడు అన్నపురెడ్డి గోపిరెడ్డి, కోశాధికారి చంద్రశేఖరరావు, డైరెక్టర్ కొల్లి సుభాష్‌చంద్రబోస్ పాల్గొన్నారు.

యూటీఎఫ్ జిల్లా కార్యవర్గంలో విన్నకోట ఉపాధ్యాయులకు చోటు

గుడ్లవల్లేరు, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): గన్నవరంలో యూటీఎఫ్ స్వర్ణోత్సవాల్లో భాగంగా నిర్వహించిన జిల్లా కార్యవర్గ ఎంపికలో విన్నకోట జిల్లా పరిషత్ హైస్కూల్ ఉపాధ్యాయులు లంకా నరేంద్ర, ఎ.వి.వరలక్ష్మి యూటీఎఫ్ జిల్లా కార్యవర్గ ప్రధాన కార్యదర్శులుగా ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. యూటీఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు నక్కా వెంకటేశ్వర్లు ఓ ప్రకటనలో వెల్లడించారు.

గ్రంథాలయ సంస్థ చైర్మన్ గోనుగుంట్లకు అభినందన

ఉయ్యూరు, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి) : ఆంధ్రప్రదేశ్ గ్రంథాలయ సంస్థ చైర్మన్‌గా నియమితుడైన గోనుగుంట్ల కోటేశ్వరరావుకు ముదునూరు టీడీపీ నాయకులు అభినందనలు తెలిపారు. రామలింగేశ్వరస్వామి ఆలయ ట్రస్ట్‌బోర్డు మాజీ చైర్మన్ పాలడుగు బాలాజీ ఆధ్వర్యంలో బాస్కర్, పలువురు పార్టీ నాయకులు గోనుగుంట్లను సోమవారం కలిసి పుష్పగుచ్ఛం అందజేసి సత్కరించారు.

అడుగడుగునా బెల్టుషాపులు!

● అధికారుల కనుసన్నల్లో నడుస్తున్నట్టు ఆరోపణలు

(ఆంధ్రజ్యోతి-కూచిపూడి)

ఏ గ్రామంలో చూసినా మద్యం బెల్టుషాపులు దర్శనమిస్తున్నాయి. అధికారుల కనుసన్నల్లోనే ఈ షాపులు నడుస్తున్నట్లు ఆరోపణలు వెల్లువెత్తుతు న్నాయి. ఒక్కో గ్రామంలో నాలుగైదు బెల్టుషాపులు నడుస్తుండగా, పెద్ద గ్రామాల్లో వీటి సంఖ్య మరీ ఎక్కువగా ఉంది. మొవ్వ మండలంలో 21 గ్రామ పంచాయతీలు ఉండగా, 21 గ్రామపంచాయతీల్లోనూ బెల్టుషాపుల ద్వారా మద్యం వ్యాపారాలు నడుస్తున్నాయి. లైసెన్స్ కలిగిన దుకాణాలకు సమాంతరంగా బెల్టుషాపుల నిర్వాహకులు వ్యాపారాలు కొనసాగిస్తున్నారంటే వీటి తీవ్రత అర్థం చేసుకోవచ్చు. మొవ్వ మండలంలో నాలుగు మద్యం దుకాణాలకు ప్రభుత్వం లైసెన్స్‌లు మంజూరు చేసింది. అయినప్పటికీ అనధికార బెల్టుషాపులకు లెక్కలేకుండా పోయింది. పెద్ద గ్రామాలైన మొవ్వ, కూచిపూడి, చినముత్తేవి, పెదపూడి, కాజ, కోసూరు, నిడుమోలు గ్రామాల్లోనూ బెల్టుషాపులు వెలిశాయి. నెలనెలా అధికారులకు మామూళ్లు ఇస్తున్నట్లు బెల్టుషాపుల నిర్వాహకులే బహిరంగంగా చెబుతున్నారంటే పరిస్థితి అర్థం చేసుకోవచ్చు. నివాస గృహాల మధ్య గుడి, బడి అన్న తేడా లేకుండా బెల్టుషాపులు పెట్టారని, మహిళలు, విద్యార్థులు ఇబ్బంది పడుతున్నారని అనేక పర్యాయాలు ఫిర్యాదు చేసినప్పటికీ ప్రయోజనం లేకుండా పోయిందని ఆయా గ్రామాల ప్రజలు వాపోతున్నారు. బెల్టుషాపులను నియంత్రించి ఇబ్బందులు తొలగించాలని ప్రజలు కోరుతున్నారు.



పెదముత్తేవిలో 30 మద్యం సీసాలు స్వాధీనం

పెదముత్తేవి గ్రామంలో అనధికార మద్యం అమ్మకాలు సాగిస్తున్న దండాబత్తిన నాగేంద్రబాబును సోమవారం అదుపులోకి తీసుకున్నామని ఎస్‌ఐ ఎం.సుబ్రహ్మణ్యం తెలిపారు. 30 క్వార్టర్ మద్యం బాటిళ్లు స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్లు ఆయన తెలిపారు.

ఐటీఐలో జాబ్‌మేళా

గుడివాడ, నవంబరు 11(ఆంధ్రజ్యోతి): కేబీఆర్ ప్రభుత్వ ఐటీఐ కళాశాలలో రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ, జిల్లా ఉపాధి కల్పన శాఖ, డీఆర్డీయే-సీడాప్, ఐటీఐ కళాశాలల సంయుక్త ఆధ్వర్యంలో సోమవారం జాబ్‌మేళా నిర్వహించారు. 16 మంది పాల్గొనగా ఎనిమిది మంది ఉద్యోగాలకు ఎంపికయ్యారని జిల్లా ఉపాధి కల్పన అధికారి సత్యబ్రహ్మం, జిల్లా నైపుణ్యాభివృద్ధి సంస్థ అధికారి డాక్టర్ పి.నరేష్‌కుమార్ తెలిపారు. కళాశాల ప్రిన్సిపాల్ ఎల్.గౌరీమణి, సిబ్బంది, నైపుణ్యాభివృద్ధి సంస్థ సిబ్బంది, అధ్యాపకులు పాల్గొన్నారు.

44 మంది అప్రెంటీస్‌లుగా ఎంపిక

కేబీఆర్ ఐటీఐ కళాశాలలో సోమవారం నిర్వహించిన ప్రధానమంత్రి జాతీయ అప్రెంటీస్ మేళాకు 48మంది హాజరవ్వగా 44 మంది అప్రెంటీస్‌లుగా ఎంపికయ్యారని కళాశాల ప్రిన్సిపాల్ ఎల్.గౌరీమణి తెలిపారు.



ఉద్యోగ నియామకపత్రాలను అందుకున్న అభ్యర్థులు



ప్రజాపోరు యాత్రలో సీపీఎం నాయకులు

నిత్యావసర వస్తువుల ధరలు తగ్గించాలి

● ప్రజాపోరు యాత్రలో సీపీఎం నాయకులు

గుడివాడ, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి) : నిత్యావసర వస్తువుల ధరలను తగ్గించాలని, ఉపాధి కల్పించాలని, విద్యుత్ చార్జీలను తగ్గించాలని, విశాఖ స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణను నిలుపుదల చేయాలని సీపీఎం నాయకులు డిమాండ్ చేశారు. ఎన్టీఆర్ కాలనీలో సీపీఎం ఆధ్వర్యంలో సోమవారం ప్రజాపోరుయాత్ర నిర్వహించారు. కాలనీలో కరపత్రాలను పంపిణీ చేశారు. ఈనెల 14వ తేదీన ఆర్డీవో కార్యాలయం వద్ద నిర్వహించే ధర్నాను జయప్రదం చేయాలని నాయకులు పిలుపునిచ్చారు. ఆర్సీపీ రెడ్డి, పి.రజిని, ఎల్.సురేంద్ర, ఎ.విజయకుమార్, వెంకటేశ్వర్లు, మోహన్ పాల్గొన్నారు.

ఆలయాల్లో కార్తీక శోభ

● కిటకిటలాడిన శివాలయాలు

గుడివాడ/పామర్రు/గుడ్లవల్లేరు, నవంబరు 11(ఆంధ్రజ్యోతి): కార్తీకమాసం రెండో సోమవారం శివాలయాలు భక్తులతో కిటకిటలాడాయి. శివనామస్మరణతో ఆలయాలు మార్మోగాయి. వేలాది భక్తులు తెల్లవారుజాము నుంచే స్వామిని దర్శించుకున్నారు. గుడివాడలోని పెద్ద శివాలయం, చిన్న శివాల యాల్లో తెల్లవారుజామున 4గంటల నుంచే దర్శనాలు కల్పించారు. భక్తులు స్వామిని దర్శించుకున్నారు. మహిళలు ఆలయ పరిసరాల్లో కార్తీక దీపాలను వెలిగించారు. పామర్రు శివాలయంలో మహిళలు కార్తీక దీపాలను వెలిగించారు. భవానీ, అయ్యప్ప, శివ మాలధారులు ఆలయాలను సందర్శించి ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు. గుడ్లవల్లేరు గంగా పార్వతీ సమేత సిద్ధేశ్వరస్వామి ఆలయంలో లక్ష రుద్రాక్షల శివలింగానికి భక్తులు అభిషేకాలు చేశారు.



గుడివాడ శివాలయంలో ప్రత్యేక పూజలు





పామర్రు శివాలయంలో కార్తీక దీపాలు వెలిగిస్తున్న భక్తులు.. గుడ్లవల్లేరు సిద్ధేశ్వరాలయంలో..

అభివృద్ధే కూటమి ప్రభుత్వ లక్ష్యం

కానూరులో రోడ్ల నిర్మాణానికి శంకుస్థాపన కార్యక్రమంలో మంత్రి నారాయణ

పెనమలూరు, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి) : అభివృద్ధే లక్ష్యంగా కూటమి ప్రభుత్వం పని చేస్తుందని మంత్రి నారాయన అన్నారు. కానూరులో రోడ్ల నిర్మాణానికి మంత్రి నారాయణ సోమవారం శంకుస్థాపన చేశారు. రూ.3 కోట్లతో కానూరు ప్రధాన రోడ్డు, అమరావతి కాలనీ రోడ్డు, వృద్ధుల ఆశ్రమం రోడ్డు, డ్రెయిన్ల నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. కానూరులో డ్రెయిన్లను పరిశీలించిన మంత్రి చలించిపోయారు. ఈ ప్రాంత అభివృద్ధికి తాను సహకరిస్తానని స్థానిక ఎమ్మెల్యే బోడె ప్రసాద్‌కు హామీ ఇచ్చి అతి తక్కువ కాలంలో వంతెనను ప్రజలకు అందుబాటులోకి తీసుకురావడంపై అభినందించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే బోడె ప్రసాద్ మాట్లాడుతూ, కొత్తగా ఏర్పడిన తాడిగడప మునిసిపాలిటీలో గత ప్రభుత్వం అభివృద్ధిని ఏవిధంగా నిర్లక్ష్యం చేసిందో వివరించారు. కనీస మౌలిక వసతులైన రోడ్లు, డ్రెయిన్లు వీధిలైట్ల ఏర్పాటుకు సహకరించాలని మంత్రిని అభ్యర్థించారు. నెలరోజుల్లో లక్షమంది ప్రయాణించే యనమలకుదురు రోడ్డును పూర్తిచేస్తానని హామీ ఇచ్చారు. విజయవాడ వెస్ట్ ఎమ్మెల్యే సుజనా చౌదరి మాట్లాడుతూ, తాను ఎంపీగా ఉన్న కాలం నుంచే మంత్రి నారాయణ, ఎమ్మెల్యే బోడె ప్రసాద్‌తో సత్సంబంధాలు ఉన్నాయని, తాడిగడప అభివృద్ధికి తనవంతు కృషి అందిస్తానని పేర్కొన్నారు. కార్యక్రమంలో కైకలూరు ఎమ్మెల్యే కామినేని శ్రీనివాస్, సిద్ధార్థ అకాడమీ సెక్రటరీ పాలడుగు లక్ష్మణరావు, మునిసిపల్ కమిషనర్ భవానీ ప్రసాద్, కూటమి నాయకులు పాల్గొన్నారు.



కానూరులో అభివృద్ధి పనుల శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తున్న మంత్రి నారాయణ, ఎమ్మెల్యేలు బోడె ప్రసాద్, సుజనా చౌదరి, కామినేని శ్రీనివాస్

దళిత క్రైస్తవులను ఎస్సీలుగా గుర్తించాలి

● 10 లక్షల సంతకాలు సేకరిస్తాం
● కేజీ బాలకృష్ణన్ కమిషన్‌కు అందిస్తాం
● ఎన్‌ఎఫ్‌డీసీ జాతీయ చైర్మన్ ఇందుపల్లి ఆనందకుమార్

గుడివాడ, నవంబరు 11(ఆంధ్రజ్యోతి): దళిత క్రైస్తవులను ఎస్సీలుగా గుర్తించాలని రాష్ట్రవ్యాప్తంగా 10లక్షల సంతకాల సేకరణ చేపట్టనున్నామని ఎన్‌ఎఫ్‌డీసీ జాతీయ చైర్మన్ ఇందుపల్లి ఆనందకుమార్ అన్నారు. సోమవారం నాగవరప్పాడులోని రివైల్ పెంతకోస్తు చర్చిలో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. మతం తీసుకుంటే కులం మారదన్నారు. దళితులు ఎన్నో పోరాటాలు చేయడం వల్లే కేంద్ర ప్రభుత్వం కేజీ బాలకృష్ణన్ కమిషన్‌ను ఏర్పాటు చేసిందన్నారు. కమిషన్ త్వరలో రాష్ట్రంలో పర్యటిస్తుందని తెలిపారు. దళిత క్రైస్తవులను ఎస్సీలుగా గుర్తించాలని 10లక్షల సంతకాలను సేకరించి బాలకృష్ణన్ కమిషన్‌కు అందజేయాలని నిర్ణయించామన్నారు. జాతీయ కోశాధికారి బిషప్ కె.శాంతిసాగర్, సంయుక్త కార్యదర్శి కొదమల ఎలీజా, సభ్యులు పి.వరప్రసాద్, జి.శ్యామ్‌బాబు, పాస్టర్లు పాల్గొన్నారు.



గుడ్లవల్లేరు ఎస్‌ఈఆర్‌ఎం హైస్కూల్ విద్యార్థులతో మాట్లాడుతున్న ఎస్సై

గుడ్, బ్యాడ్ టచ్‌లపై అవగాహన

గుడ్లవల్లేరు, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): తమతో ఎవరు ఎలా మాట్లాడుతున్నారో, ఎలా ప్రవర్తిస్తున్నారో గుర్తించాలని, ఎవరైనా తప్పుగా ప్రవర్తిస్తే తల్లిదండ్రు లకు చెప్పాలని ఎస్సై సత్యనారాయణ సూచించారు. సోమవారం గుడ్లవల్లేరు ఎస్‌ఈఆర్‌ఎం హైస్కూల్ విద్యార్థినులకు మహిళల భద్రత, గుడ్, బ్యాడ్ టచ్‌లపైన, రహదారి భద్రత, సైబర్ నేరాలపైన ఆయన అవగాహన కల్పించారు.

ఐక్యపోరాటాలతో సమస్యలకు పరిష్కారం

● పాస్టర్స్ ప్రేయర్ ఫెలోషిప్ రాష్ట్ర అధ్యక్షుడు జి.శ్యామ్‌బాబు

గుడివాడ, నవంబరు 11(ఆంధ్రజ్యోతి): సమస్యల పరిష్కారానికి పాస్టర్లు ఐక్యంగా ఉండి పోరాడాలని పాస్టర్స్ ప్రేయర్ ఫెలోషిప్ రాష్ట్ర అధ్యక్షుడు జి.శ్యామ్ బాబు అన్నారు. సోమవారం నాగవరప్పాడులోని రివైల్ పెంతుకోస్తు చర్చిలో రాష్ట్ర పాస్టర్స్ ప్రేయర్ ఫెలోషిప్ 5వ వార్షికోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. శ్యామ్‌బాబు అధ్యక్షతన నిర్వహించిన ఈ సమావేశంలో ముఖ్య అతిథులుగా ఎన్‌ఎఫ్‌డీసీ జాతీయ చైర్మన్ ఇందుపల్లి ఆనందకుమార్, జాతీయ కోశాధికారి బిషప్ కె.శాంతిసాగర్, సంయుక్త కార్యదర్శి కొదమల ఎలిజా, సభ్యులు పి.వరప్రసాద్ పాల్గొన్నారు. తాము ఎదుర్కొంటున్న సమస్యలను పాస్టర్లు వివరించారు. సమస్యలను రాష్ట్ర ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లి పరిష్కారానికి కృషి చేయాలని సభలో తీర్మానించారు.

బ్రాయిలర్ ధరలు



అమరావతి	(రూ.లలో)
బ్రాయిలర్ బర్డ్	124, 133, 144
చికెన్ విత్ స్కిన్	234
చికెన్ స్కిన్‌లెస్	244

నెక్ కోడిగుడ్ల ధర (100)

విజయవాడ జోన్ రైతు ధర రూ.565

మంగినపూడి బీచ్‌లో ఏర్పాట్ల పరిశీలన

మచిలీపట్నం టౌన్, నవంబరు 11(ఆంధ్రజ్యోతి): కార్తీక పౌర్ణమి సందర్భంగా ఈనెల 15వ తేదీన సముద్ర స్నానాలకు మంగినపూడి బీచ్‌కు వచ్చే లక్షలాది భక్తులకు అసౌకర్యం కలగకుండా అన్ని ఏర్పాట్లు చేయాలని అధికారులను జాయింట్ కలెక్టర్ గీతాంజలి శర్మ ఆదేశించారు. సోమవారం ఎస్పీ ఆర్.గంగాధరరావుతో కలిసి మంగినపూడి బీచ్‌ను ఆమె సందర్శించి ఏర్పాట్లు పరిశీలించారు.



బీచ్‌లో ఏర్పాట్లను పరిశీలిస్తున్న జేసీ గీతాంజలి శర్మ, ఎస్పీ ఆర్.గంగాధరరావు

భక్తిశ్రద్ధలతో కార్తీక పూజలు

భక్తులతో కిటకిటలాడిన శివాలయాలు





దక్షిణ చిరువోలులంకలో పూజలందుకుంటున్న బాలశివశంకర్ భగవాన్, చల్లపల్లి శివాలయంలో దీపారాధనలు చేస్తున్న మహిళలు



నాగాయలంకలో కృష్ణానదిలో పుణ్యస్నానాలు ఆచరిస్తున్న భక్తులు

మచిలీపట్నం/నాగాయలంక/అవనిగడ్డ రూరల్/చల్లపల్లి/పెడన/పెడన రూరల్, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): కార్తీక మాసం రెండో సోమవారం సందర్భంగా శివాలయాల్లో స్వామికి ప్రత్యేక అభిషేకాలు, అర్చనలు నిర్వహించారు. భక్తులు భక్తిశ్రద్ధలతో పూజలు జరిపారు. మచిలీపట్నం రాబర్ట్సన్‌పేటలోని రామలింగేశ్వర స్వామి, బచ్చుపేటలోని భ్రమరాంబ సమేత మల్లేశ్వర స్వామి, కొజ్జిల్లిపేట నాగేశ్వర స్వామి దేవాలయాల్లో ప్రత్యేక అభిషేకాలు నిర్వహించారు. మహిళలు దీపారాధనలు జరిపారు. నాగాయలంక శ్రీరామ పాదక్షేత్రం పుష్కర ఘాట్‌లోని కృష్ణానదిలో వేకువజాము నుంచే భక్తులు పుణ్యస్నానాలు చేశారు. కార్తీక దీపాలను వెలిగించి నదిలోకి వదిలారు. వేకనూరులోని సూర్యనారాయణ స్వామి ఆలయ ప్రాంగణంలో నందీశ్వరుడి విగ్రహానికి భక్తులు పూజలు చేశారు. దక్షిణ చిరువోలు లంకలో బాలశివశంకర్ భగవాన్‌కు క్షీరాభిషేకం, పూజలు చేశారు. వేకనూరులోని ఉభయ ముక్తీశ్వరస్వామి క్షేత్రంలో భక్తులు స్వామిని దర్శించుకున్నారు. నడకుదురు పృద్వీశ్వరక్షేత్రంలో భక్తులు పోటెత్తారు. చల్లపల్లి సీఐ కె.ఈశ్వరరావు దంపతులు స్వామిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. చల్లపల్లి, లక్ష్మీపురం, పాగోలు శివాలయాల్లో మహిళలు దీపారాధనలు చేశారు. పెడనలో గంగాపార్వతీ సమేత అగస్త్యేశ్వరస్వామి దేవస్థానానికి భక్తులు పోటెత్తారు. చెన్నూరులోని గంగా పార్వతి సమేత నారదలింగేశ్వరస్వామి, ఉప్పలకలవగుంటలోని నాగేశ్వరస్వామి, ఉరివిలోని పార్వతీ సమేతసోమేశ్వరస్వామి, మడకలోని భోగ లింగేశ్వరస్వామి, చోడవరంలోని అన్నపూర్ణ సమేత కాశీ విశ్వేశ్వరస్వామి, నడుపూరు, కూడూరు, నందిగం, బల్లిపర్రు, లంకలకలవగుంట శివాలయాల్లో భక్తులు పూజలు చేశారు.

సందడిగా వనసమారాధన

మోపిదేవి: పంచాయతీ శివారు వార్పు వద్ద ఉన్న బాలసుబ్రహ్మణ్యేశ్వరస్వామి దేవస్థానం దేవుని చెట్టు వద్ద కార్తీక వనసమారాధన సందడిగా జరిగింది. పలు ప్రాంతాల నుంచి విచ్చేసిన భక్తులు స్వామిని దర్శించుకుని వన సమారాధనలో పాల్గొన్నారు. మోపిదేవి, అవనిగడ్డ ప్రాంతాలకు చెందిన కూరగాయల రైతులు, వ్యవసాయ రైతుల ఆధ్వర్యంలో సాగిన వనసమారాధనలో 10 వేల మందికి పైగా పాల్గొని అన్నప్రసాదం స్వీకరించారు. అయ్యప్ప స్వాములు, భవానీ మాలధారుల భజన సంకీర్తనలతో ఆ ప్రాంతం మారు మ్రోగింది.



రహదారిపై భారీ గుంతలు

అధ్వానంగా.. విశ్వనాథపల్లి-కోడూరు రహదారి

● మండల కేంద్రానికి వెళ్లేందుకు ప్రజలకు ఇక్కట్లు

(ఆంధ్రజ్యోతి-కోడూరు): కోడూరు నుంచి విశ్వనాథపల్లి గ్రామానికి వెళ్లే 7.5 కిలోమీటర్ల రహదారి రెండేళ్లుగా అధ్వానంగా ఉంది. విశ్వనాథపల్లి, పిట్టల్లంక, బడేవారిపాలెం, సాలెంపాలెం, వేణుగోపాలపురం గ్రామాల నుంచి కోడూరుకు ప్రైవేట్ పాఠశాలలకు, జూనియర్ కళాశాలలకు వచ్చే విద్యార్థులు ఐదు కిలోమీటర్లు అదనంగా ప్రయాణించాల్సి వస్తోంది. కొంచెం వర్షం పడితే ఆటోలు కూడా తిరగడం లేదు. అడుగడుగునా గుంతలు పడి రాళ్లు తేలటంతో రాత్రి సమయంలో ద్విచక్రవాహనంపై వెళ్లాలంటే ఇబ్బంది పడుతున్నామని గ్రామస్థులు చెబుతున్నారు. ఈ రహదారి నిర్మాణానికి గత ప్రభుత్వ హయాంలో పీఆర్ ప్రాజెక్టు రూ.13 లక్షలు మంజూరు చేసి, టెండర్లు పిలిచింది. తర్వాత వాటిని రద్దు చేసింది. నాలుగైదు గ్రామాల ప్రజలు మండల కేంద్రానికి రావటానికి అవసరమైన రహదారి నిర్మాణాన్ని వెంటనే చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.



అవస్థలు పడుతున్నాం

పిల్లలు పాఠశాలలకు వెళ్లాలన్నా, అనారోగ్యంతో అత్యవసర పరిస్థితుల్లో ప్రథమ చికిత్స నిమిత్తం ఆస్పత్రికి వెళ్లాలన్నా తీవ్ర అవస్థలు పడుతున్నాం. వెంటనే రోడ్డు నిర్మించాలి.

-తాతా గాంధీ, విశ్వనాథపల్లి

టెండర్లు పిలిచింది వాస్తవమే

గతంలో రోడ్డు నిర్మాణానికి టెండర్లు పిలిచిన మాట వాస్తవమే. మరలా ప్రభుత్వమే వాటిని నిలిపివేసింది. రోడ్డు నిర్మాణానికి ప్రతిపాదనలు పంపాం. - రాజేంద్ర, పీఆర్ ప్రాజెక్టు జేఈ

కూటమి ప్రభుత్వమైనా నిర్మించాలి



గత ప్రభుత్వ హయాంలో రోడ్డు నిర్మాణం చేపడుతున్నామంటూ, నిధులు విడుదల చేశామని ప్రచారం చేశారు. కానీ పని జరగలేదు. కూటమి ప్రభుత్వమైనా రోడ్డు నిర్మించాలి.

- కొండవీటి యానాది, విశ్వనాథపల్లి



ఘంటసాలలో తహసీల్దార్ విజయప్రసాద్‌కు వినతిపత్రం అందజేస్తున్న రైతు సంఘ నాయకులు

రైతులకిచ్చిన హామీలు అమలుచేయాలి

చల్లపల్లి/ఘంటసాల, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): రైతులకిచ్చిన హామీలను అమలుచేయాలని, పెట్టుబడి సాయం రూ.20 వేలు అందించాలని కూటమి ప్రభుత్వాన్ని ఏపీ రైతు సంఘ నాయకులు హనుమానుల సురేంద్రనాథ్ బెనర్జీ, గుత్తికొండ రామారావు డిమాండ్ చేశారు. సోమవారం చల్లపల్లి తహసీల్దార్ కార్యాలయంలో డీటీ శ్రీలతకు, ఘంటసాలలో తహసీల్దార్ బి.వి జయప్రసాద్‌కు వారు వినతిపత్రాలందించారు. సంఘనేతలు పాల్గొన్నారు.



అగ్ని ప్రమాదంలో ఇల్లు దగ్ధమైన కుటుంబానికి రూ.79 వేల నగదును సీఐ ఈశ్వరరావుతో అందజేయిస్తున్న విజయక్రాంతి విద్యార్థులు

తోటి విద్యార్థి కుటుంబానికి అండగా..

చల్లపల్లి, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): ఘంటసాల దళితవాడకు చెందిన ఉప్పులేటి సుదర్శన్ గృహం ఇటీవల అగ్నిప్రమాదంలో దగ్ధమైంది. సుదర్శన్ రెండో కుమారుడు కార్తీక్ చల్లపల్లిలోని విజయక్రాంతి జూనియర్ కళాశాలలో ఇంటర్మీడియట్ ద్వితీయ సంవత్సరం చదువుతున్నాడు. కళాశాల విద్యార్థులు, అధ్యాపక బృందం కలిసి సమీకరించిన రూ.79వేల నగదును సోమవారం సీఐ కె.ఈశ్వరరావు చేతులమీదుగా ప్రిన్సిపాల్ దుట్టా శివరామ్‌ప్రసాద్ బాధిత కుటుంబసభ్యులకు అందజేశారు. కళాశాల ఫీజు, పరీక్ష ఫీజును రూ.17,600ను కరస్పాండెంట్ దుట్టా శివరామప్రసాద్ మాఫీ చేశారు. మరో రూ.3400 నగదు అందించారు.



నాగాయలంకలో టీడీపీ మండల సమావేశంలో మాట్లాడుతున్న నియోజకవర్గ పరిశీలకుడు కనపర్తి శ్రీనివాసరావు

కార్యకర్తలకు అండగా టీడీపీ

నాగాయలంక, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): ఐదేళ్ల వైసీపీ పాలనలో అరాచకాలకు ఎదురొడ్డి నిలిచిన కార్యకర్తలకు అండగా పార్టీ ఉంటుందని, వారిని గుర్తిస్తుందని టీడీపీ అవనిగడ్డ నియోజకవర్గ పరిశీలకుడు కనపర్తి శ్రీనివాసరావు అన్నారు. పార్టీ మండల అధ్యక్షుడు మెండు లక్ష్మణరావు ఆధ్వర్యంలో సోమవారం బండ్రెడ్డి వెంకటేశ్వరరావు రైస్ మిల్లు దగ్గర నిర్వహించిన పార్టీ మండల విస్తృత స్థాయి సమావేశంలో ఆయన మాట్లాడారు. టీడీపీ కార్యకర్తల బాగోగులపై మంత్రి నారా లోకేశ్ దృష్టికి తీసుకెళ్తానని తెలిపారు.

11 మద్యం సీసాలు స్వాధీనం

కోడూరు, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): వి.కొత్తపాలెం గ్రామంలో మద్యం అమ్ముతున్న కోలా రేణుకయ్య వద్ద ఆదివారం రాత్రి 11 మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకున్నామని ఎస్ఐ కె.చాణక్య తెలిపారు. కేసు నమోదు చేసినట్లు ఆయన పేర్కొన్నారు.

కుమార్తె ఇంటి నుంచి వెళ్లిపోయిందని ఫిర్యాదు

మచిలీపట్నం టౌన్, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): ఆనందపేటలో పదిహేడేళ్ల తన కుమార్తె ఇంటి నుంచి సోమవారం వెళ్లిపోయిందని, ఆచూకీ లభించలేదని తండ్రి చిలకలపూడి పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. సీఐ నబీ కిడ్నాప్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

మోదీ విధానాలతో దేశాభివృద్ధి

మచిలీపట్నం టౌన్, నవంబరు 11(ఆంధ్రజ్యోతి): ప్రధాని మోదీ విధానాలతో దేశాభివృద్ధి జరుగుతుందని బీజేపీ కృష్ణాజిల్లా అధ్యక్షుడు గుత్తికొండ రాజాబాబు అన్నారు. సోమవారం అన్నం వీరరాఘవయ్య కల్యాణ మండపంలో నిర్వహించిన సంఘటన పర్వ్‌లో ఆయన మాట్లాడారు. బీజేపీ జిల్లా ఇన్‌చార్జి కపర్తి పాల్గొన్నారు.

ఫీజు రీయింబర్స్‌మెంట్ విడుదల చేయాలి

మచిలీపట్నం టౌన్, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులకు పెండింగ్ స్కాలర్‌షిప్‌లు, ఫీజు రీయింబర్స్‌మెంట్ విడుదల చేయాలని కలెక్టరేట్ వద్ద సోమవారం అఖిల భారతీయ విద్యార్థి పరిషత్ (ఏబీవీపీ) మచిలీపట్నం శాఖ ఆధ్వర్యంలో నాయకులు నిరసన ప్రదర్శన నిర్వహించారు. మచిలీపట్నంలో ప్రభుత్వ జూనియర్, డిగ్రీ కళాశాలలు ఏర్పాటు చేయాలని వారు డిమాండ్ చేశారు. ఐదు నెలలు గడుస్తున్నా ఇప్పటివరకు ప్రభుత్వం విద్యార్థుల సమస్యలను పట్టించుకోవడం లేదన్నారు. జీవో నెంబరు 27 రద్దు చేయాలని, నాణ్యమైన విద్యను అందించాలని జేసీ గీతాంజలి శర్మకు వినతిపత్రం అందించారు. సంఘ నాయకుడు మాదిరెడ్డి సుబ్రహ్మణ్యం తదితరులు పాల్గొన్నారు.



కలెక్టరేట్ ఎదుట నిరసన తెలుపుతున్న ఏబీవీపీ నాయకులు



మూడో రోజు దీక్ష కొనసాగిస్తున్న బంటుమిల్లి, కృత్తివెన్ను మండలాల రైతులు

దాళ్వాకు అనుమతి ఇవ్వకుంటే నిరసన ఉధృతం

బంటుమిల్లి, నవంబరు 11(ఆంధ్రజ్యోతి): బంటుమిల్లి ప్రధాన కాలువ పరిధిలో దాళ్వా పంటకు ప్రభుత్వం అనుమతి ఇవ్వాలని, అధికారులు ప్రజా ప్రతినిధులు వెంటనే స్పందించాలని, అనుమతి ఇవ్వని పక్షంలో నిరసన ఉధృతం చేస్తామని రైతుసంఘం నాయకులు హెచ్చరించారు. దాళ్వాకు అనుమతి ఇవ్వాలంటూ రైతు సంఘం ఆధ్వర్యంలో చేపట్టిన రిలే నిరాహార దీక్ష సోమవారానికి మూడో రోజుకు చేరుకుంది. బంటుమిల్లి, కృత్తివెన్ను మండలాల రైతులు పాల్గొన్నారు. న్యాయవాది యాళ్ల శ్యామ్‌బాబు సంఘీభావం తెలిపారు. రైతు సంఘం నాయకులు మలిశెట్టి శివరామ్‌ప్రసాద్, అజయ్ ఘోష్, వెంట్రపాటి సురేష్, సుజ్ఞానం జనార్దనరావు, సుజ్ఞానం మహేష్, యడ్లపల్లి పెద్దిరాజులు పాల్గొన్నారు.

చిలకలపూడి పాపారావుకు శుభాకాంక్షలు

అవనిగడ్డ, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): అగ్నికుల క్షత్రియ వెల్ఫేర్ అండ్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ఛైర్మన్‌గా నియమితులైన సర్పంచ్‌ల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు చిలకలపూడి పాపారావుకు ఎన్ఆర్ఐ బొబ్బా గోవర్ధన్ సోమవారం శుభాకాంక్షలు తెలిపారు. విజయవాడలో పాపారావును కలిసి నియోజకవర్గంలోని అగ్నికుల క్షత్రియుల సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని, మత్స్యకార గ్రామాల్లో సదుపాయాలు మెరుగుపర్చేందుకు సహకరించాలని కోరారు.



చిలకలపూడి పాపారావును సత్కరిస్తున్న ఎన్ఆర్ఐ బొబ్బా గోవర్ధన్

విద్యుత్ షాక్‌తో తాపీమేస్త్రి మృతి

మచిలీపట్నం టౌన్, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): వలందపాలెంలో తాపీమేస్త్రీ విద్యుత్‌ఘాతంతో మృతిచెందాడు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. గూడూరు మండలం కోకనారాయణపాలెం గ్రామానికి చెందిన తటవర్తి నరసయ్య(26) తాపీ పనికోసం వలందపాలెం వచ్చాడు. నూతన భవన నిర్మాణ పనులు చేస్తుండగా పక్కన ఉన్న విద్యుత్ హైటెన్షన్ వైరు తగిలి అక్కడికక్కడే మృతిచెందాడు. పేదరికంలో ఉన్న మృతుడి కుటుంబాన్ని ఆదుకోవాలని ఇంటి యజమానితో టీడీపీ నాయకులు సంప్రదింపులు జరిపారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఇద్దరికి కారుణ్య నియామకాలు

మచిలీపట్నం టౌన్, నవంబరు 11(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ ఉద్యోగం చేస్తూ అనారోగ్యంతో మృతి చెందిన ఉద్యోగుల కుటుంబ సభ్యులు ఇద్దరికి సోమవారం కలెక్టర్ బాలాజీ కారుణ్య నియామక పత్రాలు అందజేశారు. రమ్యను జిల్లా పంచాయతీ కార్యాలయంలోను, నవ్యను గన్నవరం పంచాయతీ కార్యాలయంలోను జూనియర్ అసిస్టెంట్లుగా నియమించారు. జిల్లా పంచాయతీ అధికారి అరుణ పాల్గొన్నారు.

14న పరమ శివుడి విగ్రహ ప్రతిష్ఠ

చల్లపల్లి, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): లక్ష్మీపురంలోని దుర్గాపార్వతీ సమేత సోమేశ్వరస్వామి ఆలయంలో గురువారం ఉదయం 10:15 గంటలకు పరమశివుడి విగ్రహ ప్రతిష్ఠా మహోత్సవం నిర్వహించనున్నారు. లక్ష్మీపురం ప్రముఖుడు నూకల లక్ష్మయ్య దంపతుల ఆధ్వర్యంలో నిర్వహించే ఈ కార్యక్రమంలో పరమశివుడి విగ్రహానికి గ్రామాల్లో ఊరేగింపు ఉత్సవం నిర్వహించారు. సోమవారం హుస్సేన్‌పాలెం నుంచి విగ్రహాన్ని చల్లపల్లి మీదుగా లక్ష్మీపురం గ్రామానికి ఊరేగింపుగా తీసుకెళ్లారు.



శివుడి విగ్రహాన్ని ఊరేగింపుగా తీసుకెళుతున్న నూకల లక్ష్మయ్య

కర్ణభక్త సంక్షేమ సంఘ పట్టణ కార్యవర్గం

పెడన, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): కాత్యాయనిదేవి ఆలయ ఆవరణలో వాసా గంగాధరరావు అధ్యక్షతన నిర్వహించిన సర్వజనసభలో పట్టణ కర్ణభక్త సంక్షేమ సంఘాన్ని సోమవారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. సంఘానికి అధ్యక్షుడిగా వాసా సాంబశివరావు, ఉపాధ్యక్షులుగా శల శ్యామలరావు, దొడ్డిపట్ల నాగేశ్వరరావు, కార్యదర్శిగా తమ్మా బీమయ్య, సంయుక్త కార్యదర్శిగా రావూరి కోటి వీరభద్రం, కోశాధికారిగా కమతం సత్యనారాయణ ఎన్నికయ్యారు. వివిధ రంగాల్లో రాణిస్తున్న కర్ణభక్త సామాజికవర్గానికి చెందిన మహిళలను కార్యవర్గ సభ్యులు సన్మానించారు.

ఘనంగా మౌలానా అబుల్ కలాం ఆజాద్ జయంతి

మచిలీపట్నం టౌన్, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): మౌలానా అబుల్ కలాం ఆజాద్ సేవలు మరువలేనివని హెల్పింగ్ హ్యాండ్స్ ప్రతినిధి నూర్జహాన్ అన్నారు. సోమవారం రాజుపేట బాలుర మదరసాలో మౌలానా అబుల్ కలాం ఆజాద్ జయంతిని ఘనంగా నిర్వహించారు. మైనారిటీ నాయకులు షేక్ జలీల్, రియాజ్ హుస్సేన్ పాల్గొన్నారు. విద్యార్థులకు స్వీట్లు పంచారు. రాజుపేట మౌలానా అబుల్ కలాం ఆజాద్ టవర్ వద్ద సోమవారం కాంగ్రెస్ నాయకులు మౌలానా అబుల్ కలాం ఆజాద్ జయంతిని ఘనంగా నిర్వహించారు. మచిలీపట్నం అసెంబ్లీ కాంగ్రెస్ కో-ఆర్డినేటర్ అబ్దుల్ మతీన్, సయ్యద్ నూరుద్దీన్ పాల్గొన్నారు.

కాంగ్రెస్ ఆధ్వర్యంలో..

చల్లపల్లి, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): చల్లపల్లిలో మౌలానా అబుల్ కలాం ఆజాద్ ఆజాద్ జయంతిని కాంగ్రెస్ సీనియర్ నాయకుడు మీర్ రిజ్వాన్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఆజాద్ చిత్రపటానికి కాంగ్రెస్ నేతలు, ముస్లింలు నివాళులు అర్పించారు.

మినీ గోకులం నిర్మాణాలు వేగవంతం చేయండి

మోపిదేవి, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): కొక్కిలిగడ్డ గ్రామానికి ఐదు మినీ గోకులాలు మంజూరయ్యాయని, వీటి పనులు ప్రారంభించి త్వరితగతిన పూర్తి చేయాలని సర్పంచ్ దిడ్ల జానకీ రాంబాబు సూచించారు. సోమవారం పంచాయతీ కార్యాలయం వద్ద ఉపాధి హామీ పథకం గ్రామసభలో గ్రామీణ ఉపాధి హామీ పథకంలో చేపట్టబోయే, గుర్తించిన పనుల జాబితాను టెక్నికల్ అసిస్టెంట్ నాయక్ సభలో వివరించారు. ఎంపీటీసీ సభ్యురాలు దిడ్ల రాణి, పంచాయతీ కార్యదర్శి వి.రవికుమార్ ఉద్యోగులు పాల్గొన్నారు.